ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 08.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 228 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



భారత స్టార్ పారా ఆర్చర్ శీతల్ దేవి మరో ఘనత 12

వారిద్దరూ 'బ్యాడ్ బ్రదర్స్'

నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నారు



- మెట్రో విస్తరణ లేదు, మూసీ పునరుజ్జీవం కాదు
- ట్రిపుల్ఆర్ సాగనివ్వరు, ఫ్యూచర్ సిటీకి ఆటంకం
- గోదావరి జలాల తరలింపుకు సైతం అడ్డుపుల్ల
- కేటీఆర్, కిషన్ రెడ్డి పూర్తిగా అభివృద్ధి నిరోధకులు
- బీజేపీగానీ, బీఆర్ఎస్ గానీ చేసిందేమీ లేదు
- కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్అభివృద్ధి
- రూ. 5 వేల కోట్లతో మేడ్చల్ ఎలివేటెడ్ కారిడార్లు
- విమర్శలు గుప్పించిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 7 : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేండ్లు పూర్తవుతుంది. భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలనే దానిపై విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43 వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. నగర అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డిని, జనార్ధన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన జూబ్లీహిల్స్ పార్టీ కార్యాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్ తో కలిసి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత పదేండ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్, కేంద్ర మంత్రిగా పని చేస్తున్న కిషన్ రెడ్డి కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని

..:: మిగతా 2లో

కేవలం మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారానే ఎక్సైజ్ శాఖకు రూ.2,868.8 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు తొలి విడతలో లైసెన్స్ ఫీజులో ఆరో వంతు మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించగా, అదనంగా మరో రూ.313 కోట్లు ప్రభుత్వానికి అందాయి. దీంతో ఈ లైసెన్సుల ప్రక్రియ ద్వారా వచ్చిన మొత్తం రూ.3,180 కోట్లు అని లెక్క తేలింది. అక్టోబర్ నెలలో బతుకమ్మ, దసరావంటి వరుస పండుగలు, జాతరలు ఉండటంతో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఆ నెలలో మద్యం అమ్మకాల ద్వారా రూ.3,168 కోట్ల ఆదాయం తెలంగాణ ఎక్సైజ్ శాఖకు సమకూరింది.



ఆబ్కారీ ఆదాయం ₹6500 కోట్లు

రాష్ట్ర ఖజానాకు కాసుల గలగల

నిరుటితో పోల్చితే భారీగా పెరిగిన రాబడి

- ఒక్క నెలలోనే అనూహ్యంగా పెరిగిన ఇన్ కం
- గత నెలలో పండుగలు, జాతరలే కారణం
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమంటున్న అధికారులు
- 2,620 మద్యం దుకాణాలకు అనుమతులు జారీ
- వైన్ షాపులతో వచ్చిన ఆదాయం రూ.3,180 కోట్లు
- దరఖాస్తుల ద్వారా వచ్చినది రూ.2,868.8 కోట్లు
- ఇక పెండింగ్ బిల్లుల మంజూరుకు అవకాశం
- రాష్ట్రంలో మొదలైన కొత్త మద్యం దుకాణాలు
- ఇక మార్కెట్ కు కొత్త బ్రాండ్లు వచ్చే అవకాశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 7: తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు అక్టోబర్ నెల కాసుల వర్షాన్ని కురిపించింది. పండుగల వేళ భారీగా మద్యం విక్రయాలు జరగడంతోపాటు కొత్త మద్యం షాపుల కోసం టెండర్లు పిలవడంతో భారీగా ఆదాయం సమకూరింది. నిరుటితోపోల్చితే ఈ యేడాది అక్టోబర్‌లో ఖజానాకు భారీగా డబ్బులు వచ్చాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ అక్టోబర్‌లో ఆదాయం రావడం ఎక్సైజ్ శాఖ అధికారులను కూడా ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊపునిస్తూ.ఎక్సైజ్ శాఖ రికార్డు స్థాయిలో అక్టోబర్ నెలలో ఆదాయాన్నినమోదు చేసింది. కేవలం ఒకే ఒక్క నెలలో ఏకంగా రూ.6,348 రాబడి ప్రభుత్వ ఖజానాలో జమైంది. కొత్త మద్యం పాలసీ అమలు చేయడంతోపాటు అక్టోబర్ నెలలో

..:: మిగతా 2లో



విద్యార్థుల మేధాశక్తి ఒక ప్రయోగశాల

- నిరంతర అభ్యాసమే విజయానికి మార్గం
- నైపుణ్యంతోనే విద్యార్థులకు మరింత బలం
- శ్రద్ధ, క్రమశిక్షణతో అలసటను అధిగమించండి
- లక్ష్య సాధనకు ధైర్యంగా ముందడుగు వేయండి
- విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు
- ఘనంగా శాతవాహన వర్సిటీ స్నాతకోత్సవం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

నవంబర్ 7: నిరంతర అభ్యాసంతోనే విజయం సాధ్యమవుతుందని, శ్రద్ధ, క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలని రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన శాతవాహన యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవానికి ఆయన హాజరయ్యారు. 25 మందికి పీహెచ్డీ పట్టాలతో పాటు 2018 నుంచి 2023 వరకు ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయం దిశగా తీసుకెళుతుందని అన్నారు. విద్యార్థుల మేధాశక్తియే వారి ప్రయోగశాలగా అభివర్ణించారు. విద్యార్థుల ఆలోచనలు, శ్రమ,

..:: మిగతా 2లో

ప్రతిష్టాత్మకం 'జూబ్లీ' ఉప ఎన్నిక

- 4 నాలుగు కోట్ల ప్రజల భవిష్యత్తుకు సూచిక
- రేవంత్ పాలనలో ఏ వర్గమూ ఆనందంగా లేదు
- అడిగితే పోలీసు కేసులు నమోదు చేస్తున్నారు
- అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం వచ్చింది
- 'మీట్ ద ప్రెస్' లో మాజీ మంత్రి హరీశ్ రావు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 7: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నాలుగు లక్షల మంది ప్రజల భవిష్యత్తు మాత్రమే కాదని, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల భవిష్యత్తు అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన 'మీట్ ద ప్రెస్'లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో ఏ వర్గానికి చెందిన చెందిన ప్రజలు కూడా సంతోషంగా లేరన్నారు. రాష్ట్రంలో నలుగురు రేవంత్ బ్రదర్స్ మాత్రమే సంతోషంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. రెండేండ్ల రేవంత్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగి పోయారని

..:: మిగతా 2లో



విద్య వ్యాపారం కాదు, సామాజికసేవ

- ప్రైవేటు సంస్థలు వ్యాపారం చేస్తున్నాయి
- ఎవరు తమాషా చేసినా తాట తీస్తా
- సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 7 ప్రయివేటు విద్యాసంస్థల నిర్వాహకులు తమాషా చేస్తే తాటతీస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. విద్య అనేది సేవ అని, వ్యాపారం కాదని స్పష్టం చేశారు. ప్రయివేట్ విద్యాసంస్థలు సేవ చేయడం లేదని, వ్యాపారం

..:: మిగతా 2లో



డెత్‌కు 50 వేలు పెళ్లికి 10 వేలు?

- కార్మిక శాఖలో అవినీతి జాలం
- దళారుల రాజ్యం– కార్మికుల గగ్గోలు
- దళారుల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

నవంబర్ 7: కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన కార్మిక శాఖ ఇప్పుడు అవినీతి, దోపిడీకి కేంద్ర బిందువుగా మారిందని ఆరోపణలు

..:: మిగతా 2లో

23 నెలల పాలన చూపి ఓట్లడగండి

- రేవంత్ ఇప్పటికే ఓటమిని అంగీకరించారు
- అందుకే 'జూబ్లీ' ఎన్నిక రెఫరండం కాదన్నారు
- రెండేండ్ల నుంచి అరాచక పాలన సాగించారు
- పదేండ్ల బీఆర్ఎస్ పాలన వికాసం చూసి ఓటేయండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వినతి

చిటుకుల మైసారెడ్డి, ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 7: సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన 24 నెలల పరిపాలన చూపించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజల తీర్పుకోరాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తాను చేసింది ఏమీ లేకపోవడంతోనే రేవంత్ రెడ్డి అటెన్షన్ డైవర్షన్ ప్రయత్నాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పోలింగ్ కంటే ముందే ఓటమిని అంగీకరించారని అందుకే, జూబ్లీహిల్స్ అనేక తన ప్రభుత్వానికి పరిపాలనకు తనకు రెఫరెండం కాదు అని చెప్పారని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి తన పరిపాలన పైన నమ్మకం లేకనే ప్రజలలో నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని జూబ్లీహిల్స్ ఎన్నిక రెఫరెండం కాదని చెప్పారని అన్నారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావు నగర్ లో శుక్రవారం రోడ్డు షో నిర్వహించారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత 24 నెలల కాలంలో చేసింది ఏమీ

..:: మిగతా 2లో





'వందేమాతరం' ఒక స్వప్నం, ఒక సంకల్పం

వందేమాతర గీతం ఒక స్వప్నం, ఒక సంకల్పం. ఒక మంత్రం, దేశమాత ఆరాధన, సాధన అని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. వందేమాతరం. మనల్ని పురాణ ఇతి హాసాలలోకి తీసుకెళ్తుందని, భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుందని చెప్పారు.

11



ఓటరు సవరణ సజావుగా సాగేనా

సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓటర్ల జాబితాలను డిజిటల్ యుగానికి అనుగుణంగా మార్చే ప్రయత్నం. బిహార్‌లో చేపట్టిన ప్రక్రియ విజయవంతమైంది.

11



వచ్చే యేడాది ఇండియాకు ట్రంప్!

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మీద అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. మోడీ చాలా గొప్ప వ్యక్తి అని, తనకు మంచి స్నేహితుడని చెప్పారు.

11



ట్రంప్ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నాం

ప్రపంచంలో అణ్వాయుధాలను తరచుగా పరీక్షిస్తున్న దేశాలలో పాకిస్తాన్ కూడా ఉందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది.

11

రాష్ట్రీయం

డెత్‌కు 50 వేలు పెళ్లికి 10 వేలు?

మొదటిపేజీ తరువాయి

వెల్లువెత్తుతున్నాయి. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి లభించే డెత్ క్లెయిమ్, వివాహం చేసుకున్న కార్మికులకు లభించే వివాహ కానుక పథకాల పేరుతో అధికారులు, దళారులు కలిసి డబ్బు వసూలు చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. 'డెత్ క్లెయిమ్ కావాలంటే ముందుగా 50 వేలు, వివాహ కానుక కోసం 10 వేలు చెల్లించాల్సిందే' అని చెబుతున్నారు. ఈ డబ్బులు ముందుగా దళారులకు జమ చేసిన తరువాతే కార్మికుల బ్యాంకు ఖాతాలలో ప్రభుత్వ సాయం జమవుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మిక శాఖలో ప్రతి పనికి ఒక 'రేట్ కార్డ్' ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కార్మిక కార్డుల నమోదు, వివాహ కానుక, అంగవైకల్యం, మరణ క్లెయిమ్, ఏ పని అయినా ఒక నిర్దిష్ట మొత్తాన్ని కట్టకపోతే ఫైల్ కదలదట.ఈ క్రమంలో కొంతమంది అధికారులు, ఏజెంట్లు, బ్రోకర్లు కలిసి ఏకంగా ఓ దోపిడీ వ్యవస్థను నెలకొల్పారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కార్మికుల గగ్గోలు

'ప్రభుత్వం మాకు సాయం ఇస్తుంది కానీ, ఆ డబ్బు కూడా అధికారులు మాకు ఇవ్వడానికి ముందు తమ 'షేర్' అడుగుతున్నారు. మరణం పైన కూడా వ్యాపారం చేస్తున్నారు' అంటూ బాధిత కార్మికుల కుటుంబాలు విలపిస్తున్నాయి. కొందరు తమ డబ్బులు వసూలు చేసుకోవడానికే నెలలు తిరుగుతున్నారట. వార్షికంగా కోట్ల రూపాయల సబ్సిడీలు, సంక్షేమ నిధులు ఈ శాఖ ద్వారా వెళ్తున్నప్పటికీ, అవినీతి నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. 'కార్మికుల హక్కుల కోసం ఉన్న శాఖే, వారిని దోచుకుంటే ఎవరి దగ్గరికి వెళ్ళాలి?' అనే ప్రశ్న చర్చనీయాంశంగా మారింది. కార్మిక సంఘాలు, సామాజిక సంస్థలు ఈ అవినీతి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.ఇక కార్మికుల హక్కులు కాపాడాలంటే "దళారుల వ్యవస్థను రద్దు చేయాలి, ఆన్‌లైన్ పారదర్శక వ్యవస్థను తీసుకురావాలి" అని వారు సూచిస్తున్నారు.

ప్రతిష్టాత్మకం 'జూబ్లీ' ఉప ఎన్నిక

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఈ అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. తెలంగాణ సమాజం అందుకోసం ఎదురు చూస్తోందని అన్నారు. కేసీఆర్ పాలనలో వికాసం జరిగితే, రేవంత్ పాలనలో విధ్వంసం మాత్రమే జరిగిందని విమర్శించారు. వికాసం కావాలో, విధ్వంసం కావాలో అనే విషయాన్ని ఆలోచించి జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మెయిలర్


రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ అని హరీశ్ రావు ఆరోపించారు. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి రియల్ ఎస్టేట్ వ్యాపారులను, విద్యాసంస్థలను బ్లాక్ మెయిల్ చేశారని హరీశ్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.19,500 కోట్ల ఫీజు రీయింబర్సుమెంట్ చెల్లించిందని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండు రూపాయలు కూడా చెల్లించలేదని విమర్శించారు. దీంతో కాలేజీలను మూసి వేశారని చెప్పారు. ఆరోగ్య శ్రీ పథకం అమలు జరగడం లేదని, ఆసుపత్రులకు ప్రభుత్వం రూ.1,900 కోట్ల బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. బకాయిలు అడిగితే అధికారులపైనా, ఆసుపత్రులపైనా పోలీసు దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. పలు పెద్ద ప్రాజెక్టులను చెరువులలో కడుతున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పినా సీఎం పట్టించుకోవడం లేదని అన్నారు. ఉద్యోగ సంఘాల మీద ఏసీబీ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశంలో అత్యధిక డీఏలు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రంగా తెలంగాణ మారిందని అన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను బెదిరిస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. పథకాలు ఆగిపోతాయని ప్రజలను భయ పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు.

సీఎం ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు

రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లో ఓటమి భయంతో ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని హరీశ్ విమర్శించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. ఆరు వేల రెండు పడక గదుల ఇళ్లు కడతామని చెప్పి ఒకటీ కట్ట లేదని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల జరుగుతున్న తరుణంలో మాత్రమే మైనారిటీలకు మంత్రి పదవి ఇచ్చారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వీటిలో ఆరు లక్షల సీసీ కెమెరాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం వాటి నిర్వహణ చేయలేని దుస్థితికి ప్రభుత్వాన్ని దిగజార్చారని ఆరోపించారు. నడి రోడ్డుపై హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

'బనకచర్ల' లింక్ ప్రాజెక్టు టెండర్లు రద్దు

- తెలంగాణ పోరాటానికి తలొగ్గిన ఏపీ సర్కారు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7: బనకచర్ల ప్రాజెక్ట్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రాజెక్టు డీపీఆర్ టెండర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రద్దు చేసింది. తెలంగాణ ప్రభుత్వ పోరాటంతో ఏపీ సర్కార్ వెనక్కి తగ్గింది. ఏపీ ప్రభుత్వం 2025, అక్టోబర్ 8న టెండర్లను పిలిచింది. అక్టోబర్ 22 ఉదయం 11 గంటల వరకు టెండర్ సమర్పించేలా గడువు విధించింది. ఈ క్రమంలో ఎట్టిపరిస్థితులలో బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దంటూ కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. స్వయంగా సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖలు రాయడంతో పాటు రెండు రాష్ట్రాల సీఎంలతో కేంద్రం ఏర్పాటు చేసిన మీటింగులోనూ పాల్గొన్నారు. ఆనాడు లోపల బనకచర్ల గురించి చర్చ జరగలేదని చెప్పినా, ఏపీ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు బయట మీడియాతో బనకచర్లను కట్టి తీరుతామని చెప్పారు. తరువాత అది టెండర్ల వరకు వచ్చింది. దీంతో ఈ వ్యవహారంపై సీడబ్ల్యూసీకి ఫిర్యాదు చేశారు. టెండర్ల ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లో ఆపాలని డిమాండ్ చేశారు. ఏపీ అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రాజెక్టు చేపడుతోందని, వరద జలాల కాన్సెప్టే లేనప్పుడు దాని ఆధారంగా ఎలా ప్రాజెక్టును చేపడతారని ప్రశ్నించారు. వెంటనే టెండర్ల ప్రక్రియను ఆపడంతో పాటు ముందుకు వెళ్లకుండా ఏపీని కట్టడి చేయాలని కోరారు.



రైతుల సంక్షేమానికి సర్కారుతో కలిసి రండి

- నాబార్డు అధికారులతో మంత్రి 'తుమ్మల'

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7: రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని నాబార్డు అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో నాబార్డు సీజీఎం ఉదయ్ భాస్కర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. నాబార్డు అధికారులు గ్రామీణాభివృద్ధి కోసం ప్రభుత్వంతో భాగస్వామ్యం, మైక్రో ఇరిగేషన్ పథకం కోసం నిధుల విడుదల, బహుళోపయోగ ప్రాథమిక సహకార సంఘాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, సూక్ష్మ సాగు, సహకార రంగ బలోపేతం వంటి అంశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నాబార్డ్ మద్దతు అందిస్తోందని అన్నారు. ఇందుకోసం గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి కింద 202526 ఆర్థిక సంవత్సరానికి 300 కోట్లు రాష్ట్రానికి కేటాయించినట్లు నాబార్డు అధికారులు తెలిపారు. ఈ నిధులు తక్కువ వడ్డీ రేటుతో అందిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ ముగిసేలోపు ప్రతిపాదనలు సమర్పించినట్లయితే ఈ నిధులను వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని మంత్రికి తెలిపారు.



తిరుమలలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తాం. ఇందుకు సంబంధించి టోకెన్ల జారీ వివరాలను త్వరలో ప్రకటిస్తాం. ఈ నెల 17 నుంచి 25 వరకు కార్తీక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నాం. అంగప్రదక్షిణ టోకెన్ల జారీని డిప్ విధానం నుంచి మార్చాం. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన 2026 ఫిబ్రవరి నుంచి ఆన్‌లైన్ కోటా రిలీజ్ చేస్తాం.

- టీటీడీ ఈవో
అనిల్ సింఘాల్

ఆబ్కారీ ఆదాయం ₹6500 కోట్లు

మొదటిపేజీ తరువాయి

పండుగల సీజన్ కలయికతో ఈ అద్భుత వృద్ధి సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఎక్సైజ్ శాఖకు వచ్చిన ఈ మొత్తం ఆదాయంలో దాదాపు సగం వాటా కొత్త మద్యం పాలసీ మార్పుల ద్వారానే వచ్చిందని తెలుస్తోంది. తెలంగాణలో 2,620 మద్యం దుకాణాలకు రెండేండ్ల కాలానికి కొత్త లైసెన్సులు ఇచ్చే ప్రక్రియలో భాగంగా దరఖాస్తులను ఆహ్వానించగా, భారీగా స్పందన లభించింది. గతంలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఒక్కో షాప్ కోసం రూ. రెండు లక్షల దరఖాస్తు ఫీజు వసూలు చేసేవారు. ఈ మొత్తాన్ని వెనక్కి ఇచ్చేవారు కాదు. అయితే ఈసారి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దరఖాస్తు ఫీజును రూ. రెండు లక్షల నుంచి రూ. మూడు లక్షలకు పెంచింది. ఫీజును భారీగా పెంచినా మద్యం దుకాణాల లైసెన్సుల కోసం 95,628 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

అక్కడి నుంచే అధిక ఆదాయం

కేవలం మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారానే ఎక్సైజ్ శాఖకు రూ.2,868.8 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు తొలి విడతలో లైసెన్స్ ఫీజులో ఆరో వంతు మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించగా, అదనంగా మరో రూ.313 కోట్లు ప్రభుత్వానికి అందాయి. దీంతో ఈ లైసెన్సుల ప్రక్రియ ద్వారా వచ్చిన మొత్తం రూ.3,180 కోట్లు అని లెక్క తేలింది. అక్టోబర్ నెలలో బతుకమ్మ, దసరావంటి వరుస పండుగలు, జాతరలు ఉండటంతో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఆ నెలలో మద్యం అమ్మకాల ద్వారా రూ.3,168 కోట్ల ఆదాయం తెలంగాణ ఎక్సైజ్ శాఖకు సమకూరింది. నిరుడు అక్టోబర్‌లో మద్యం అమ్మకాల ద్వారా రూ.2,987 కోట్లు రాగా, ఈసారి ఆ రికార్డును అధిగమించడం గమనార్హం.ఈ రెండు ప్రధాన వనరుల నుంచి వచ్చిన రూ.6,348 కోట్ల భారీ ఆదాయంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ అదనపు ఆదాయం కారణంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరగా మంజూరవుతాయని మద్యం సరఫరాదారులు, కాంట్రాక్టర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక కొత్త మద్యం దుకాణాలు రావటంతో, చాలా కాలంగా ప్రభుత్వ అనుమతి కోసం వేచి చూస్తున్న కొత్త బ్రాండ్ల పైన వచ్చే వారం నిర్ణయం వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు.

విద్యార్థుల మేధాశక్తి ఒక ప్రయోగశాల

మొదటిపేజీ తరువాయి



సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయని తెలిపారు. అవకాశం, సమానత్వం సృజనాత్మకతతో ఎదగాలని ఆకాంక్షించారు. విద్యారంగంలో ప్రమాణాలు నెలకొల్పాలన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యారంగం బోర్డు, చాక్ పీస్ లకే మాత్రమే పరిమితం కావద్దని అన్నారు. ప్రస్తుతం విద్యా రంగం సాంకేతికతతో ముందుకు సాగుతోందన్నారు. డిజిటల్ లెర్నింగ్ భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని తెలిపారు. ప్రతీ విద్యార్థి నైపుణ్యం, నిరంతర అభ్యాసాలే విజయానికి దోహదం చేస్తాయని అన్నారు.

ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను

ప్రపంచ విజ్ఞానాన్ని ఆహ్వానించాలని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిపుచుకోవాలని గవర్నర్ సూచించారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరువవద్దని పేర్కొన్నారు. అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని తెలిపారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని, భయాన్ని, అలసటను అధికమించి ముందుకు సాగాలన్నారు. కృషితో ప్రతీ విద్యార్థి అభివృద్ధి సాధ్యమే అని అన్నారు. విద్యార్థి దశ నుండే సేవా మార్గాన్నిఅనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ జె.బి. రావు, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ యు.ఉమేష్ కుమార్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పోలీస్ గౌరవ వందనం

కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ చేరుకున్న గవర్నర్ మొదటగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, డిపార్ట్మెంట్ వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. అనంతరం వందేమాతర గేయంతో కార్యక్రమాన్ని ప్రారంభించగా తదనంతరం బాలభవన్ విద్యార్థుల శాస్త్రీయ నృత్యం, అంద విద్యార్థుల పాటలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరి దానకిషోర్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ లు అశ్విని తానాజీ వాకాడే లక్ష్మి కిరణ్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ జిల్లా ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



విద్య వ్యాపారం కాదు, సామాజికసేవ

మొదటిపేజీ తరువాయి

చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ పై ప్రైవేటు విద్యాసంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాలేజీలను బంద్ చేయించిన వారితో చర్చలు ఎలా ఉంటాయని సీఎం ప్రశ్నించారు. కాగా, ఫీజురీయింబర్స్‌మెంట్‌పై ప్రయివేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి. లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని విద్యాసంస్థలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ప్రవేటు విద్యాసంస్థలపై సీఎం సీరియస్ అయ్యారు.



23 నెలల పాలన చూపి ఓట్లడగండి

మొదటిపేజీ తరువాయి

చెప్పుకోవడానికి లేకపోవడంతోనే పాత కాలం కథలు చెబుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలలో ప్రజలకు కష్టాలు తప్పడం లేదని, సబ్బండ వర్గాలను ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేశారని అన్నారు. విద్యార్థులు యువకులు రైతన్నలు పారిశ్రామికవేత్తలకు చేసిన మోసాన్ని చూసినందుకు కాంగ్రెస్ కు ఓటు వేయాలా అని ప్రశ్నించారు. నగరాన్ని అధఃపాతాళానికి తీసుకువెళ్లినందుకు నగర ప్రజలు కాంగ్రెస్ కు ఓటు వేయాలా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో గెలిస్తే అభివృద్ధి చేస్తామంటూ కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాలపైన కేటీఆర్ మండి పడ్డారు గతంలో ఇవే మాటలు చెప్పి కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిచిన తర్వాత ఒక్క రూపాయి అభివృద్ధి పని కూడా చేయలేదని గుర్తు చేశారు.

ఓటు వేయాలని తాము అడిగితే

పదేండ్ల అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తాము అడిగితే రేవంత్ రెడ్డి తనకు సంబంధంలేని గత ప్రభుత్వపు కాంగ్రెస్ పరిపాలన చూసి ఓటు వేయాలని అడగడంపైన కేటీఆర్ ఎద్దేవా చేశారు. తాము ఐటీ పరిశ్రమ నుంచి మొదలుకొని టిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణము ప్రజారోగ్యం, రోడ్లు, ఫ్లై ఓవర్లు, లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, 47 ఫ్లై ఓవర్లు రోడ్ల నిర్మాణం, రాష్ట్రాన్ని ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామన్నారు. భారత రాష్ట్ర సమితి సర్కారు నగరాన్ని అగ్రస్థానంలో నిలిపిందని అన్నారు. రేవంత్ రెడ్డి గత రెండు సంవత్సరాలలో హైదరాబాదు నగరాన్ని పూర్తిగా పతనావస్థకు చేర్చి రియల్ ఎస్టేట్ నుంచి మొదలుకొని ఆటో డ్రైవర్ల వరకు అందరి ఉపాధి అవకాశాల పైన దెబ్బకొట్టి అనేక వర్గాలు ఆత్మహత్యలకు పాల్పడేలా పరిపాలన సాగిందన్నారు. హైడ్రా పేరుతో అరాచకం చేశారని, వేలాదిమంది పేదల ఇళ్లు కూలగొట్టిన రేవంత్ రెడ్డి పెద్దవాళ్ళ అక్రమాల జోలికి వెళ్లలేదని విమర్శించారు. హైడ్రా బుల్డోజర్ పేదవాళ్ళ ఇంటికి బస్తీల జోలికి రావద్దంటే 11వ తేదీన జరిగే ఉప ఎన్నికలో కాంగ్రెస్ కు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గనుక ఎన్టీ రామారావు విగ్రహాలు పెడితే ఆయన ఆత్మ క్షోభిస్తుందని కేటీఆర్ అన్నారు.

వారిద్దరూ 'బ్యాడ్ బ్రదర్స్'

మొదటిపేజీ తరువాయి

అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గోదావరి జలాలు 20 టీఎంసీలు హైదరాబాద్ కు తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారని విమర్శించారు. నగరంలో నిర్మించాలని అనుకున్న వంతెనలు, అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. 30 యేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ టు శామీర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు అప్రూవల్ తెచ్చి రూ.5,000కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. ఉత్తర తెలంగాణ మొత్తం ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనే ఆధారపడి ఉందని సీఎం చెప్పారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ వాటి అనుమతులకు ప్రయత్నం చేయలేదని విమర్శించారు.

అదనంగా రెండు విమానాశ్రయాలు

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చామని సీఎం చెప్పారు. అదనంగా కొత్తగూడెం, రామగుండం విమానాశ్రయాలకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో 2004-2014 మధ్య కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే భాగ్యనగరం ఎక్కువగా అభివృద్ధి చెందిందని సీఎం రేవంత్ అన్నారు. ఓఆర్ఆర్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మెట్రో రైలు ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందని గుర్తుచేశారు. 2014 నుంచి కేంద్రంలోని బీజేపీ, ఇక్కడ బీఆర్ఎస్‌రాష్ట్రానికి చేసింది శూన్యమని రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఏర్పడిందన్న ఆయన 2023లో కేసీఆర్ తెలంగాణను రూ. ఎనిమిది లక్షల కోట్ల అప్పులలో పెట్టి మళ్లీ కాంగ్రెస్‌కు అప్పగించారన్నారు. హైదరాబాద్‌కు ఆనాడు యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది ఎవరు? అని ప్రశ్నించారు. ఐటీఐఆర్ మంజూరు చేసి ఉంటే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ఉండేదన్నారు. వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదని ధ్వజమెత్తారు.

వాటివల్ల ఏమైనా ఉపయోగం ఉందా?

బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం, సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతి భవన్ నిర్మించారని, కుమారుడిని సీఎంను చేయాలని, వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూలగొట్టి కొత్తది నిర్మించారని సీఎం ఆరోపించారు. పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? అని ప్రశ్నించారు. కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టేందుకు, ఫోన్ ట్యాపింగ్ కోసం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకున్నారు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారని ఆక్షేపించారు. ప్రగతిభవన్ లో బుల్లెట్ ప్రూఫ్ బాత్రూములు కట్టుకున్నారని ధ్వజమెత్తారు. నగరాన్ని అభివృద్ధి చేయాలంటే ప్రజా ప్రతినిధుల సహకారం ఉండాలని అందుకే జూబ్లీ హిల్స్ గెలవాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. బీజేపీ, బీఆరెస్ సహకరించి ఉంటే నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకునే వాళ్లం అని అన్నారు. మెట్రో విస్తరణ చేసుకుందాం, గోదావరి జలాలు తెచ్చుకుందాం, మూసీ ప్రక్షాళన చేసుకుందాం అని కోరారు. ఎందుకు మూసీ ప్రక్షాళన అడ్డుకుంటున్నావ్ కిషన్ రెడ్డి? ఎందుకు కేటీఆర్ కు లొంగిపోయావ్? అంటూ రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ ఓటమి, బీజేపీ డిపాజిట్ పోవడం ఖాయమని అన్నారు. మరి బండి సంజయ్ హిందువులు బీజేపీ తో లేరని దీన్ని రిఫరెండంగా భావిస్తారా? ఇందుకు బండి సంజయ్ ఒప్పుకుంటారా? అంటూ ప్రశ్నించారు. కిషన్ రెడ్డికి లేని బాధ బండి సంజయ్ కు ఎందుకు? అని ఎద్దేవా చేశారు.



రాష్ట్రీయం

బీఆర్ఎస్ నేతల ఇండ్లలో ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు

- తనిఖీల అనంతరం ఏమీ దొరకలేదన్న అధికారులు
- ఎన్నికల సమయంలో తనికీలు సహజం: మంత్రి 'పొన్నం'



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక దృష్ట్యా భారీగా డబ్బు నిల్వ ఉంచారన్న ఫిర్యాదుతో హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నేతల ఇండ్లలో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అకస్మాత్తుగా సోదాలు నిర్వహించింది. నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఇండ్లలో అధికారులు సోదాలు చేశారు. మోతీ నగర్‌లోని మర్రి జనార్దన్‌రెడ్డి ఇంటిలో, రెహమత్‌నగర్‌లోని రవీందర్‌రావు ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర బలగాలు, పోలీసులు అక్కడ భారీగా మొహరించడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అధికారులు ఇండ్లలోకి వెళ్లకుండా బీఆర్ఎస్ శ్రేణులు పోలీసులు అడ్డుకున్నారు. తనిఖీలలో ఎలాంటి నగదు లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. ఎన్నికల సమయంలో సోదాలు సహజమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.ఫిర్యాదులు వస్తే సోదాలు చేయడం ఎన్నికల సంఘం బాధ్యత అని చెప్పారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం బీఆర్ఎస్‌కు అలవాటని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి పది వేల ఓట్లు కూడా రావని, కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి నియోజకవర్గంలోనే బీజేపీని ఎవరూ పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు.

బీఆర్ఎస్ ఓటమి తప్పదని తెలిసిపోయింది

- అందుకే కేటీఆర్, హరీశ్ రావు హడావుడి
- మీడియాతో మంత్రి సీతక్క



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : తమపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమి ఖాయమని హరీశ్ రావు, కేటీఆర్ కు తెలిసిపోయిందని, అందుకే హడావుడి చేస్తున్నారని మంత్రి సీతక్క ఆరోపించారు. సొంత చెల్లిని, మాగంటి తల్లిని కేటీఆర్ మోసం చేశారని ఆరోపించారు. మాగంటి తల్లి ఆవేదన చూస్తే కేటీఆర్ ఎంత మోసకారో అర్థమవుతుందన్నారు. 91 యేండ్ల వృద్ధురాలు అని కూడా చూడకుండా మాగంటి తల్లిని కేటీఆర్ అవమానపరిచారన్నారు. మాగంటి తల్లి ఆరోపణలపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళలు కేటీఆర్ తీరును గమనించాలని కోరారు. హరీశ్ రావు నిశ్శబ్ద విప్లవం అని ప్రగల్బాలు పలుకుతున్నారంటూ ధ్వజమెత్తారు. నిన్నటి వరకు విషాదంలో ఉన్న హరీశ్ రావు శుక్రవారం హడావుడిగా బయటకు వచ్చి ఎందుకు ప్రచారం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. ఓటమి భయంతోనే తన తండ్రి ఖర్మ చేసి 24 గంటలు గడవకముందే ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. ఓటమి తప్పదని తెలిసి అవస్తవాలు మాట్లాడుతున్నారన్నారు కేటీఆర్ కు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం అని పేర్కొన్నారు.



'ప్రైవేట్' యాజమాన్యాలతో చర్చలు సఫలం

- నిరసన రద్దు చేసుకున్నట్టు సమాఖ్య ప్రకటన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7: ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. దీంతో నిరసన కార్యక్రమాలన్నింటిని రద్దు చేసుకుంటున్నట్లు వారు ప్రకటించారు. శుక్రవారం రాత్రి ప్రజాభవన్ లో చర్చలు జరిపారు. కళాశాల యాజమాన్యాలు బకాయిలకు సంబంధించి 1,500 కోట్లు అడిగారు. ఇప్పటికే 600 కోట్లు విడుదల చేసామని, మరో 600 కోట్లు వెంటనే విడుదల చేస్తామని, మరో 300 కోట్లు కొద్ది రోజులలోనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఫీజు రీయింబర్సుమెంటుకు సంబంధించి ఒక కమిటీ వేయాలని కళాశాలల యాజమాన్యాలు అడిగాయి. త్వరలో ఒక కమిటీ ఏర్పాటు చేసి త్వరితగతిన కమిటీ నివేదిక వచ్చేలా చేస్తామని, ఏ రకమైన సంస్కరణలు అవసరమో చర్చిస్తామని, ఆ కమిటీలో అధికారులతో పాటు యాజమాన్యాల ప్రతినిధులకు అవకాశం కల్పిస్తాం డిప్యూటీ సీఎం వివరించారు. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దేవసేన మీదగానీ, సీఎం కార్యాలయ అధికారులపై గానీ, డిప్యూటీ సీఎం కార్యాలయం అధికారులపై గానీ తాము ఎలాంటి వ్యాఖ్యానాలు చేయలేదని యాజమాన్య ప్రతినిధులు స్పష్టం చేశారు. తాము మీడియా సమావేశంలో ఒకటి మాట్లాడితే కొన్ని మీడియా సంస్థలు మా మాటలను వక్రీకరించాయన్నారు.



24 నుంచి పార్లమెంటు సమావేశాలు

- 'ఎస్ఐఆర్'పై సమగ్ర చర్చకు చాన్స్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 7: పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబర్ చివరి వారంలో ప్రారంభం కానున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. పార్లమెంటు ఉభయ సభలు ఈనెల 24 లేదా 25 నుంచి సమావేశం అవుతాయని పేర్కొన్నాయి. డిసెంబర్ 19 వరకు ఇవి కొనసాగుతాయని చెప్పాయి. కాగా ఈసీ చేపట్టిన దేశవ్యాప్త ఎస్ఐఆర్ ను వ్యతిరేకిస్తూ ఓట్ చోరీ అంటూ విమర్శలు గుప్పిస్తున్న విపక్షాలు దీనిపై చర్చకు పట్టుబట్టే అవకాశం ఉంది. యూఎస్ టారిఫ్స్ పైనా ప్రస్తావించవచ్చని సమాచారం.



కౌంటింగ్ నిర్వహణపై సిబ్బందికి శిక్షణ

- నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : ఉప ఎన్నిక కు సంబంధించి నవంబర్ 14న నిర్వహించే కౌంటింగ్ ను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో ఉప ఎన్నిక కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్లకు మొదటి విడత శిక్షణ నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియ నిబంధనలను వివరించారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. నగరంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ నిర్వహిస్తారని తెలిపారు. కౌంటింగ్‌లోనిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల నియమావళి పై రూపొందించిన మాన్యువల్ పై పూర్తి అవగాహనను ఏర్పరచుకొని పగడ్బందీగా పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలోని ఓట్ల లెక్కింపు జరపాలన్నారు. ఈ నెల 13 వ తేదీన కౌంటింగ్ సిబ్బందికి మరోవిడత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల బాధ్యులు సునంద, మమత పాల్గొన్నారు.



మరో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం

- వెనుక నుంచి ఢీకొట్టిన డీసీఎం

ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి, నవంబర్ 7: రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న బస్సు ప్రమాదాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. రోజుకో చోట ఆర్టీసీ బస్సులు ప్రమాదానికి గురవుతున్నాయి. ఇటీవల రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన బస్సు ప్రమాదంలో దాదాపు 19 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఏదో ఒక ప్రాంతంలో బస్సు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా రంగారెడ్డి జిల్లాలో మరో బస్సు ప్రమాదం జరిగింది. ఆర్టీసీని బస్సును ఓ డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తా వద్ద శుక్రవారం ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వేగంగా దూసుకొచ్చిన డీసీఎం వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఒక్కసారిగా ఢీకొట్టడంతో బస్సులోని ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు. స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకుని బస్సులోని ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు.

955 మంది సైబర్ నేరగాళ్లు అరెస్ట్

- నిందితుల నుంచి రూ.107 కోట్లు రికవరీ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7: సైబర్ నేరగాళ్ల వలలో అనేక మంది చిక్కుకుంటున్నారు. మాయ మాటలతో అమాయకులను ఈజీగా మోసం చేసి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారు. రోజుకో రకంగా కొత్త ఎత్తుగడలతో ప్రజలను మోసం చేస్తూ నగదును దోచుకుంటున్నారు. సోషల్ మీడియాలో పెట్టుబడుల పేరుతో, ఫోన్ కాల్స్, ఫేక్ యాప్‌లు, మెసేజ్ లింక్‌ల ద్వారా ప్రజల బ్యాంక్ వివరాలను సేకరించి డబ్బులు దోచుకుంటున్నారు. రోజు రోజుకు సైబర్ నేరాలు ఎక్కువవడంతో పోలీసులు వాటిపై ఫోకస్ పెట్టారు. అక్టోబర్‌లో సైబర్ నేరాలకు సంబంధించి భారీగా కేసులు నమోదయ్యాయి. వీటిని ఛాలెంజ్‌గా తీసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు, వివిధ రాష్ట్రాలలో గాలించి మరీ సైబర్ కేటుగాళ్లను అరెస్ట్ చేశారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న 55 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 107 కోట్లను రికవరీ చేశారు. అక్టోబర్ నెలలో సైబర్ నేరాలకు సంబంధించి 196 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా 55 మందిని అరెస్ట్ చేశారు. మోసపోయి నగదు కోల్పోయిన బాధితులకు వారి సొమ్మును తిరిగి అప్పజెప్పారు. దాదాపు 66 లక్షల రూపాయలను బాధితులకు అందజేశారు. 55 నిందితులపై దేశవ్యాప్తంగా 136కేసులు నమోదయ్యాయని తెలిపారు. నిందితులు ఎనిమిది రాష్ట్రాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. అరెస్ట్ అయిన వారిలో ఎక్కువ శాతం ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందినవారని సైబర్ పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి సెల్ ఫోన్లు, ల్యాప్ ట్యాప్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



ముస్లింల మెప్పు పొందేందుకు కాంగ్రెస్ తపన

- ఉప ఎన్నికలో బీజేపీ గెలవబోతోంది
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : ముస్లింల మెప్పు పొందేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చిందని, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ గెలవబోతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నేతలు కూడా స్థానికంగా సర్వే నిర్వహించారని బండి సంజయ్ తెలిపారు. ఏ సర్వేకు అనుగుణంగా ఆ పార్టీలు గెలుస్తాయని ప్రచారం చేశారని అన్నారు. బీఆర్ఎస్ స్థాయి పెంచాలని సర్వే సంస్థకు ఆదేశించారని, ఆంధ్రలోని సర్వే సంస్థకు రూ. రెండు కోట్లు ఇచ్చారని ఆరోపించారు. రెండు పార్టీలకు గుణపాఠం చెప్పి బీజేపీకి అకాశం ఇవ్వాలని ప్రజల ఆలోచన అని అన్నారు. తెలంగాణలో ఇండియన్ ముస్లిం కాంగ్రెస్ గా పార్టీ పేరు మార్చుకుందని, బీజేపీ ఐఎంసీ మధ్య ఉప ఎన్నికలో పోటీ జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక వర్గం ఓట్ల కోసమే తాపత్రయపడుతోందిని బండి సంజయ్ పేర్కొన్నారు.



వరల్డ్ కప్ విజేతకు ఏపీ సర్కార్ నజరానా

- శ్రీచరణికి గన్నవరంలో ఘన స్వాగతం

ప్రతిపక్షం ప్రతినిధి, అమరావతి, నవంబర్ 7 : మహిళల వరల్డ్‌కప్ సాధించిన జట్టులో కీలక పాత్ర పోషించిన శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్‌లోకి ఘన స్వాగతం లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెకు భారీ నజరానా ప్రకటించింది. గ్రూప్1 ఉద్యోగం, ఇంటి స్థలం, రెండున్నర కోట్ల నగదు ఇవ్వాలని నిర్ణయించారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు దేశానికి ఖ్యాతిని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఉదయం గన్నవరం విమానాశ్రయంలో ఏసీఏ ఆధ్వర్యంలో శ్రీచరణికి ఘన ఘనస్వాగతం లభించింది. మంత్రులు వంగలపూడి అనిత, సవిత, సంధ్యారాణి సాదరంగా ఆహ్వానించారు. ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, సెక్రటరీ సానా సతీష్ బాబు, ట్రెజరర్ దండమూడి శ్రీనివాస్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అభినందనలు తెలిపారు. ఆమెకు స్వాగతం పలికేందుకు అభిమానులు కూడా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. గన్నవరం నుంచి శ్రీచరణిని ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ నివాసానికి తీసుకెళ్లారు.

48 గంటలు అప్రమత్తంగా ఉండాలి

- సబ్బండ వర్గాలు కాంగ్రెస్ వైపే ఉన్నాయి
- పార్టీ చేరికల కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి మరో 48 గంటల సమయం మాత్రమే ఉండడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ యూసుఫ్ గూడా డివిజన్ లో సుడిగాలి పర్యటన చేశారు. బైక్ మీద తిరుగుతూ నేతలను సమన్వయ పరుస్తూ ప్రతి ఓటరును కలిశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్థానికుడు, విద్యావంతుడు నవీన్ యాదవ్ కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వెంగల్ రావు నగర్ స్థానిక నాయకుడు సంజయ్ గౌడ్, ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్ బీజేపీ కి చెందిన కార్యకర్తలు, నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటు వేసి గెలిపించాలని మంత్రి వారిని కోరారు. కాంగ్రెస్ లోకి ఎవరైనా రావచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు. ప్రజా పాలన ప్రభుత్వం లో అమలు చేస్తున్న పథకాలు సన్న బియ్యం పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కంటోన్మెంట్ ఎన్నికల మాదిరి జూబ్లీహిల్స్ లోనూ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలంటే ఈ మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం నాయి బ్రాహ్మణ సంఘాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం ఏర్పాటు చేశారు.



ఏటీసీలో సాంకేతిక లోపం వల్లే ఢిల్లీ, ముంబైలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సాంకేతిక సమస్య వెనుక బయటి వ్యక్తుల ప్రమేయం లేదు. అయినా లోతైన దర్యాప్తు జరుపుతున్నాం. విమానాలు సకాలంలో నడిచేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూస్తాం.
- కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

ఓపెన్ వాయిస్

పీఓకే స్వాధీనానికి యత్నాలు

దేశ విభజన సమయంలో అప్పటి కశ్మీర్ రాజు హరిసింగ్ తన రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు పలు ప్రయత్నాల తర్వాత అంగీకరించారు. ఆ ప్రక్రియ సాంకేతికంగా పూర్తయింది. కానీ, వాస్తవ స్థితిని చూసినపుడు, కశ్మీర్‌లో కొంత భాగం పాకిస్తాన్ ఆక్రమణకు గురై ఇప్పటికీ వారి అధీనంలోనే ఉంది. ఈ భాగం, ఆ భాగం అని గాక మొత్తం కశ్మీర్ ప్రశ్నపై రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధాలలో ఏమీ తేలలేదు. భారత సైన్యం తూర్పు పాకిస్తాన్‌ను విడదీసి అక్కడి పాకిస్తాన్ సైన్యాన్ని పెద్ద సంఖ్యలో బందీగా పట్టుకున్నపుడు, పీఓకేను మనకు వదలుకుంటేనే ఆ బందీలను వదలగలమనే షరతు విధించవలసిందనే అభిప్రాయం ఒకటుంది. ఎందుకైతేనేమి అది జరగలేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం, కశ్మీర్ సరిహద్దు వివాద పరిష్కారంపై చర్చలు జరిగాయి గానీ, పీఓకేను సైనికంగా స్వాధీనపరచుకోవడమనే అంశం అజెండాపైకి రాలేదు. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చినప్పటి నుంచి పీఓకే స్వాధీనం ప్రస్తావనలు వస్తున్నాయి. ఎప్పటికైనా ఆ పని చేస్తామంటున్నారు. ఆ ధోరణికి అనుగుణంగానే ఆయన ప్రభుత్వం, కశ్మీర్ వివాదమంటూ అసలు ఏమీ లేదని, దానిపై పాకిస్తాన్‌తో చర్చించవలసింది కూడా ఏమీ లేదని, చర్చించటమంటూ ఉంటే వారు పీఓకేను మనకు స్వాధీనం చేయడం గురించి మాత్రమేనని అంటూ వస్తున్నది. అందుకు పొడిగింపుగా మాట్లాడుతూ, మనమే ఏదో ఒక రోజు ఆ భూభాగాన్ని స్వాధీనపరచుకోగలమని చెబుతున్నది. దీనంతటిలోని సాంకేతికతలను అట్లుంచితే, ఆచరణకు సంబంధించిన ప్రశ్నలు కొన్నింటిని గమనించవలసి ఉంటుంది. ఆ విధమైన ఆక్రమణ సాధ్యమా అన్నది ఒక ప్రశ్న కాగా, ఒకవేళ ఆక్రమించినా దానిని అధీనంలో ఉంచుకుని నియంత్రించగలరా! అన్నది మరొక ప్రశ్న. యుద్ధాలు, ఆక్రమణలు, నియంత్రణలు అనే మూడు కూడా ఆషామాషీ విషయాలు కావు. అందువల్ల ఆవేశంతోగాక జాగ్రత్తగా ఆలోచించవలసి ఉంటుంది. మొదట యుద్ధం మాట చూస్తే, పాకిస్తాన్ కన్న ఇండియా చాలా శక్తివంతమైనదని వేరే చెప్పనక్కరలేదు. కానీ, రెండు దేశాలకు అణ్వస్త్రాలు ఉండటం విస్మరించలేనిది. పాకిస్తాన్ 'న్యూక్లియర్ విధానం' ప్రకారం, తమ భూభాగానికి, భౌగోళిక సమగ్రతకు ముప్పు ఏర్పడినట్లయితే అణ్వస్త్రాలు ఉపయోగిస్తారు. ఆ పని నిజంగా జరుగుతుందా! అనేది వేరే విషయం. కానీ, జరగదని కూడా ఎవరూ హామీ ఇవ్వలేరు. పాక్ ఒకసారి తూర్పు పాకిస్తాన్‌ను కోల్పోయిన తర్వాత, మరొక భూభాగాన్ని పోగొట్టుకునేందుకు సిద్ధపడటం తేలిక కాదు. అందువల్ల, పీఓకేను స్వాధీనపరచుకునే లక్ష్యంతోనే యుద్ధమన్నది తేలిక కాదు. ఆ స్థాయి యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా జోక్యమన్నది సరేసరి. పీఓకే స్వాధీనం జరుగుతుందని వాదన కోసం ఒప్పుకుంటే, అపుడు నియంత్రణ ప్రశ్న ముందుకు వస్తుంది. స్వాధీనం తక్షణం జరిగేది కాగా, నియంత్రణ దీర్ఘకాలికం. అందులోని సాధక బాధకాలేమిటి? కశ్మీర్ లోయ భూభాగం 15 వేల చదరపు కిలోమీటర్లకు పైగా ఉంది. పీఓకే వైశాల్యం అంతకు రెట్టింపు కన్న ఎక్కువ. జనాభా ఇక్కడ సుమారు 1 కోటి 80 లక్షల కాగా, అక్కడ దాదాపు 55 లక్షలు. వీరంతా ముస్లింలే. ఇటు వైపున భూభాగం ఏ విధంగానైతే కొండలు, లోయలు, నదులతో సంక్లిష్టమైనదో, అటువైపునది బహుశా అంతకన్న సంక్లిష్టమైనది. ఇటు వైపు గలవారికి మన పట్ల ప్రేమ, విధేయత లేదనుకుంటే, వారికీ లేవు. వీరు నిరసనలకు, తీవ్రవాద చర్యలకు పాల్పడుతున్నారనుకుంటే, అటువైపు వారు అందుకు తోడవుతారు. అటువైపు వారికి పాకిస్తాన్ పట్ల కొంత నిరసన భావన ఉండవచ్చు. దాని అర్థం ఇండియాను ప్రేమిస్తున్నారని కాదు. వీరూ వారు కలిస్తే కశ్మీరీ జాతి మొత్తంగా స్వతంత్ర భావనలు బలపడి, రెండు దేశాలతో సంబంధం లేని విధంగా స్వతంత్ర కశ్మీర్ ఆలోచనలు తలెత్తగల అవకాశం ఉంటుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
08.11.2025

'పోక్సో' చట్టంపై అవగాహన అవసరం

పోక్సో చట్టంపై మొదటగా తల్లిదండ్రులకు సంపూర్ణ అవగాహన అవసరం. తల్లిదండ్రులు పిల్లలకు, వారి శరీరానికి సంబంధించిన హక్కులు, వ్యక్తిగత హద్దులను గూర్చి వివరించాలి. పిల్లలు భయం లేకుండా తమ సమస్యలను, అనుభవాలను తల్లిదండ్రులతో పంచుకునేలా ఒక నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలి. పిల్లల విషయంలో ఏదైనా అన్యాయం జరిగినప్పుడు తల్లిదండ్రులు సంయమనంతో వ్యవహరించాలి. పిల్లలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని తెలిసినప్పుడు పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు నివేదించాలి. విద్యార్థులకు ఈ చట్టంపై కనీస అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది.



సుధాకర్ ఏవీ
9000674747


ఇటీవల విడుదలైన చిత్రం 'కోర్టు'తో పోక్సో చట్టం మరొకసారి తెరపైకి వచ్చింది. ఈ చిత్రంలో దర్శకుడు పోక్సో చట్టంపై ప్రజలకు ఏ మేరకు అవగాహన ఉన్నది, ఆ చట్టం ఏ విధంగా దుర్వినియోగమవుతుందో కండ్లకు కట్టినట్లుగా చూపించారు. వాస్తవానికి ఈ చట్టం మీద చాలా మంది ప్రజలకు అవగాహన లేదనేది వాస్తవం. అసలు ఈ చట్టం రూపొందించడానికి కారణం ఏమిటి, ఈ చట్టం ద్వారా పడే శిక్షలను గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. 18 యేండ్ల లోపు బాలలను లైంగిక నేరాల నుండి రక్షించడానికి రూపొందించినదే పోక్సో చట్టం POSCO (Protection of Children from Sexual Offences Act 2012). ఈ చట్టాన్ని. 22-05-2012 న భారత పార్లమెంట్ ఆమోదించింది. 2012 నవంబర్ 14నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం కన్నా ముందు గోవా చిల్డ్రన్ యాక్ట్-2023 అనేది పిల్లల లైంగిక వేధింపులకు సంబంధించిన ఏకైక చట్టం. ప్రపంచంలో అత్యధిక పిల్లల జనాభా ఉన్న దేశాలలో భారతదేశం ఒకటి. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల సంఖ్య 472 మిలియన్ కాగా ఇందులో 225 మిలియన్ మంది బాలికలు ఉన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం దేశంలోని బాలల రక్షణ భారతీయ పౌరులకు హామీ ఇవ్వబడింది.

చిదిమేసే నీచులు ఎక్కడో ఉండరు!

చిన్నారులను చిదిమేసే నీచులు ఎక్కడో ఉండరు. మంచిగా నటిస్తూ ఉన్న శ్రేయోభిలాషులో, బంధువులో, ట్యూషన్ సార్, సన్నిహితుల రూపంలో చుట్టూనే ఉంటూ పిల్లలపై దుర్మార్గులు వికృతక్రీడకు తెర లేపుతున్నారు. ఇలాంటి అకృత్యాలను అడ్డుకోవడానికి ప్రభుత్వం పోక్సో చట్టాన్ని తీసుకొచ్చింది. మహిళలపై అత్యాచారానికి పాల్పడినవారికి జీవితఖైదుగానీ. ఏడేండ్ల నుంచి పదేండ్ల జైలుశిక్షగానీ వేస్తారు. 16 యేండ్ల లోపు బాలికపై అత్యాచారం జరిపితే కనీస శిక్షగా 10 నుండి 20 సంవత్సరాల వరకు జైలు జీవితం అనుభవించాల్సి వస్తుంది. నిరుడు 221 మందికి జీవిత ఖైదు అందులో 33 మంది పోక్సో కేసుల నిందితులున్నారు. అత్యాచారం చేయడమే కాదు. అభ్యంతరకరంగా తాకినా, దురుద్దేశంతో మాట్లాడినా 'పోక్సో' చట్టం క్రిందికే వస్తుంది. 2021 నుండి నమోదైన కేసులను పరిశీలిస్తే 2021లో 2,567 కేసులు 2022లో 2,432 కేసులు, 2023లో 2,426 కేసులు, 2024లో 2,057 కేసులు నమోదయ్యాయి. 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఉదంతం తదుపరి మహిళలు, పిల్లలపై జరిగే నేరాల విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. వీటిని అరికట్టేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు 'నిర్భయఫండ్' పేరుతో ప్రత్యేక నిధులు కూడా విడుదల చేస్తోంది. పోక్సో కేసుల సత్వర విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను కూడా ఏర్పాటుచేసింది. తెలంగాణలో పోక్సో కేసుల విచారణకు 36 ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానాలు ఏర్పాటవగా కేవలం పోక్సో కేసుల కోసమే 9 న్యాయస్థానాలు ఏర్పాటయ్యాయి.

చిన్నారులను విచారించే సమయంలో

పోక్సో కేసులకు సంబంధించి న్యాయస్థానాలలో చిన్నారు



లను విచారించే సమయంలో వారు భయపడకుండా ఆహ్లాదకర వాతావరణ పరిస్థితులు కల్పిస్తున్నారు. వాంగ్మూలం నమోదుచేసే సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల దోషులకు శిక్షలు యేటికేడు పెరుగుతున్నాయి. చిన్నారులే కదా! ఏం చేసినా ఎవరికి తెలియదనుకుంటే పోక్సో కేసులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయి. పోక్సో చట్టం 2012లో లైంగిక నేరాల నుండి రక్షించడానికి అనేక సెక్షన్లు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా సెక్షన్ 3. 5, 7 మరియు 9 సెక్షన్లు నేరాలకు బెయిల్ మంజూరుచేసే అంశాలను వివరిస్తున్నాయి. సెక్షన్ 12 నిర్దిష్ట నేరాలకు సంబంధించిన శిక్షలను వివరిస్తున్నాయి. సెక్షన్ 19 మైనర్లకు సంబంధించిన ఏదైనా సమాచారాన్ని నిషేధించడాన్ని తప్పనిసరి చేస్తుంది మరియు సెక్షన్ 19 నేరం చేయడానికి ప్రయత్నించినందుకు శిక్షను వివరిస్తుంది. ఈ చట్టంలోని సెక్షన్ 23 బాధితుల గుర్తింపును ఏరకమైన మీడియాలోనైనా బహిర్గతం చేయడాన్ని నిషేధిస్తుంది. 2019లో పోక్సో చట్టాన్ని సవరించారు. దీనిలో లైంగికదాడి, తీవ్రతరం చేసే లైంగిక దాడికి కనీస తప్పనిసరి శిక్షను వరుసగా 10 సంవత్సరాలు, 20 సంవత్సరాలకు పెంచారు. తీవ్రతరం చేసే లైంగిక దాడికి శిక్ష జీవితాంతం వరకు పొడిగించవచ్చును.

జస్టిస్ వర్మ కమిటీ నివేదిక

బాలల హక్కులకు ఐక్యరాజ్యసమితి సమావేశం ఆర్టికల్ 34ను వివరించే జస్టిస్ వర్మ కమిటీ నివేదిక పోక్సో చట్టం క్రింద సమ్మతి వయస్సును 16 సంవత్సరాలకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఈ చట్టం లైంగిక వేధింపులు, దుర్వినియోగం నుండి పిల్లలను రక్షించడానికి, 18 యేండ్ల కంటే తక్కువ వయస్సున్న ఇద్దరి మధ్య ఏకాభిప్రాయ లైంగికతను నేరంగా పరిగణించకూడదని పేర్కొంది. పోక్సో చట్టం కింద ఫిర్యాదు చేయడానికి '1098' పిల్లల కోసం కేటాయించిన టోల్ ఫ్రీ నెంబర్. 24 x 7 అందుబాటులో ఉంటుంది. అలాగే పోక్సో E Box అనేది పిల్లల లైంగిక నేరాలను సులభంగా మరియు ప్రత్యక్షంగా నివేదించడానికి, పోక్సో చట్టం 2012 ప్రకారం నేరస్థుల మీద సకాలంలో చర్యలు తీసుకోవడానికి ఒక ఆన్లైన్ ఫిర్యాదు నిర్వహణ వ్యవస్థ పోక్సో E Box ను మహిళా, శిశు అభివృద్ధి మంత్రి మేనకాగాంధీ 2016 ఆగస్టు 26న న్యూఢిల్లీలో ప్రారంభించారు.

బాలురకు సైతం సమానంగా రక్షణ

పోక్సో చట్టం 2012 బాలికలకే కాకుండా బాలురకు సైతం సమానంగా రక్షణ కల్పిస్తుంది. ఇటీవల కర్ణాటకలో 48 యేండ్ల ఉపాధ్యాయురాలు తన ఇంటికి పొరుగున ఉండే 13 యేండ్ల బాలుడిని లైంగికంగా వేధించినట్లు పోక్సో చట్టం క్రింద కేసు నమోదైంది. పోక్సో చట్టంపై మొదటగా తల్లిదండ్రులకు సంపూర్ణ అవగాహన అవసరం. తల్లిదండ్రులు పిల్లలకు, వారి శరీరానికి సంబంధించిన హక్కులు, వ్యక్తిగత హద్దులను గూర్చి వివరించాలి. పిల్లలు భయం లేకుండా తమ సమస్యలను, అనుభవాలను తల్లిదండ్రులతో పంచుకునేలా ఒక నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలి. పిల్లల విషయంలో ఏదైనా అన్యాయం జరిగినప్పుడు తల్లిదండ్రులు సంయమనంతో వ్యవహరించాలి. పిల్లలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని తెలిసినప్పుడు పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు నివేదించాలి. విద్యార్థులకు ఈ చట్టంపై కనీస అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వున్నది. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. షీటీమ్స్ ద్వారా ఈ చట్టం గూర్చి ప్రతి పాఠశాలలో అవగాహన తరగతులు ఏర్పాటు చేయాలి. అభం శుభం తెలియని చిన్నారుల జోలికి రావాలంటే భయపడేలా శిక్షించాలి. ఈ చట్టం గూర్చి తెలుసుకొనే విధంగా పాఠ్యపుస్తకాలలో ఒక పాఠ్యాంశంగా చేర్చాలి.

(వ్యాస రచయిత స్టేట్ టీచర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి)

కనిపించని దానిని చూడగలిగే ధీరులు

8 నవంబర్ 1895 న విల్‌హెమ్ కాన్రడ్ రాంటిజెన్ కృషి ఫలితంగా ఎక్స్- కిరణాల ఆవిష్కరణ జరగడం, వైద్య రంగంలో రోగ నిర్ధారణ సులభం కావడం అనే సందర్భంతో 2004 నుంచి యేటా వరల్డ్ రేడియోగ్రఫీ డే పాటిస్తున్నాం. శస్త్ర చికిత్స చేయకుండానే రేడియేషన్ టెక్నాలజీని ఉపయోగించి రోగి శరీరం లోపల జరుగుతున్న మార్పులను, అవయవాల స్థితులను చూడగలగడంతో వ్యాధి వివరాలను తెలుసుకోవడం తేలికైంది. ఎక్స్ -కిరణాలతో ప్రారంభమైన రేడియేషన్ ఆధారిత ఇమేజింగ్ టెక్నాలజీ ద్వారా సిటి- స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ లాంటి రేడియోషన్ టెక్నిక్స్ అందుబాటులోకి రావడంతో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతున్నది.



డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. వ్యాధి నిర్ధారణ, ఇమేజింగ్ టెక్నాలజీలు, శస్త్ర చికిత్సలు, ఔషధ రంగాలలో పెనుమార్పులకు నాంది పలుకుతున్నాం. నేడు ఎక్స్‌రే, ఎంఆర్ఐ లాంటి ముఖ్యమైన రేడియేషన్ ఆధారిత టెక్నాలజీలను రోగ నిర్ధారణలో వాడడంతో చికిత్సలకు మార్గం సుగమం అవుతున్నది. అత్యాధునిక వైద్యరంగంలో రేడియోగ్రాఫర్లు, రేడియోలాజిక్ టెక్నాలజిస్టుల పాత్రను కొనియాడడానికి ప్రతి యేట నవంబర్ ఎనిమిదిన విశ్వమానవాళి 'ప్రపంచ రేడియోగ్రాఫర్స్ దినం'గా పాటించడం ఆనవాయితీగా మారింది. వరల్డ్ రేడియోగ్రఫీ డే-2025 ఇతివృత్తంగా 'రేడియోగ్రాఫర్స్: కనిపించని దానిని చూడగలగడం (రేడియోగ్రాఫర్స్ : సీయింగ్ ది అన్‌సీన్)' అనబడే థీమ్‌ను తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ రేడియోగ్రఫీ దినం సందర్భంగా రేడియోలాజిక్ టెక్నాలజీ, మెడికల్ ఇమేజింగ్ లాంటి హాష్ ట్యాగ్‌లు వాడుతూ సామాజిక మాధ్యమాలలో కూడా ప్రచారం చేయడం పరిపాటి అవుతున్నది.

'ఎక్స్'- కిరణాల ఆవిష్కర్త డబ్ల్యూ. సి. రాంటిజెన్

8 నవంబర్ 1895 న విల్‌హెమ్ కాన్రడ్ రాంటిజెన్ కృషి ఫలితంగా ఎక్స్ కిరణాల ఆవిష్కరణ జరగడం, వైద్య రంగంలో రోగ నిర్ధారణ సులభం కావడం అనే సందర్భంతో 2004 నుంచి యేటా వరల్డ్ రేడియోగ్రఫీ డే పాటిస్తున్నాం. శస్త్ర చికిత్స చేయకుండానే రేడియేషన్ టెక్నాలజీని ఉపయోగించి రోగి శరీరం లోపల జరుగుతున్న మార్పులను, అవయవాల స్థితులను చూడగలగడంతో వ్యాధి వివరాలను తెలుసుకోవడం తేలికైంది. ఎక్స్ కిరణాలతో ప్రారంభమైన రేడియేషన్ ఆధారిత ఇమేజింగ్ టెక్నాలజీ ద్వారా సిటి స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ లాంటి రేడియోషన్ టెక్నిక్స్ అందుబాటులోకి రావడంతో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. క్యాన్సర్ ట్యూమర్స్, ఎముకలు విరగడం, న్యుమోనియా, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లను సులభంగా గుర్తించడం, తగు వైద్యాలను అందించడం నేటి విధానం అయ్యింది. ఎంతో ప్రగతిని సాధించడం, చికిత్స సులభం కావడం, ప్రజారోగ్య పరిరక్షణ తేలిక కావడం లాంటివి సుసాధ్యం కావడానికి రేడియోగ్రాఫర్లు నిరంతరం కృషి చేస్తున్నారని గమనించి వారి కృషిని మెచ్చుకోవడం, వారిని ప్రోత్సహించడం లాంటివి ప్రపంచ రేడియోగ్రఫీ దినం రోజున నిర్వహిస్తున్నారు. చూడలేని వాటిని చూడగలగడం, ముట్టుకోకుండానే వ్యాధి మర్మాన్ని తెలుసుకోవడం, క్షణాలలో వ్యాధి నిర్ధారణ చేయగలగడం, అటు వైద్యులు



రేడియోగ్రఫర్లకు కృతజ్ఞతలు తెలిపే సందర్భం

ఆధునిక వైద్య రంగంలో రేడియోషన్ టెక్నాలజీ ప్రాధాన్యం పెరగడంతో సాధారణ రేడియోగ్రఫీ డిప్లమా కోర్సులతో పాటుగా వైద్య కళాశాలలు రేడియోలజీలో పీజీ కోర్సులను సైతం ప్రారంభించడం చూస్తున్నాం. శరీరాన్ని తాకకుండా, దేహం లోపల అవయవాల పనితీరు, వాటిలో వచ్చిన మార్పులను తెలుసుకోవడానికి శరీర భాగాలకు రేడియేషన్ పంపించి ఫలితాలను విశ్లేషిస్తున్నారు. నేటి డిజిటల్ ఏఐ యుగంలో వైద్యరంగం సరైన ఔషధాలను సూచించగలగడం లాంటివి రేడియోగ్రాఫర్ల కృషితోనే సాధ్యం అవుతున్నాయని గమనించాలి. నవంబర్ ఎనిమిదిన మన సమీప డయగ్నోస్టిక్ సెంటర్స్‌లో సేవలందిస్తున్న రేడియోగ్రాఫర్లను గుర్తించి వారిని సన్మానాలతో ప్రోత్సహిస్తూ, కృతజ్ఞతలు సహితం కెలియజేద్దాం, అనారోగ్యాలను తొలి దశలోనే నిర్ధారించుకొని తరిమేద్దాం.

(నేడు ప్రపంచ రేడియోగ్రఫీ దినం)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

ప్రమాదంలో అమాయక హృదయాలు



మలిపెద్ది పవన్
7093052815


మన సమాజం ఇప్పుడు ఒక సున్నితమైన దశలో ఉంది. పిల్లలు ప్రేమలో పడి చనిపోతున్నారనే వార్తలు చదవడం అంటే మనం ఎక్కడో విఫలమయ్యామనే అర్థం. ప్రేమను అర్థం చేసుకునే వయసు వచ్చే వరకు పిల్లలకు రక్షణ, మార్గనిర్దేశనం అవసరం. ప్రేమించే ముందు జీవితాన్ని తెలుసుకోవాలి. ప్రేమకన్నా విలువైనది మన భవిష్యత్తు అని గ్రహించాలి. ఇటీవల బాలబాలికలలో కనిపిస్తున్న కొత్త ఆందోళనాత్మక ధోరణి ఏమిటంటే ప్రేమ పేరుతో అమాయక హృదయాలు నాశనం అవుతున్నాయి. తెలిసీ తెలియని వయసులో ఆకర్షణను ప్రేమగా భావించి, తల్లిదండ్రుల మందలింపుతో ప్రాణాలు తీసుకునే సంఘటనలు పెరుగుతున్నాయి. పెద్దల గద్దింపుతో తల్లిదండ్రులపై దాడి చేసే ఘటనలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. హైస్కూల్, ఇంటర్ స్థాయి విద్యార్థులు చాటింగ్, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకొని భావోద్వేగాల బంధనంలో చిక్కుకుంటున్నారు. మొదట స్నేహం, తర్వాత ఆకర్షణ, చివరికి ఆ ప్రేమను అడ్డుకుంటే ఆవేశంతో ఆత్మహత్య చేసుకునే స్థితికి చేరుతున్నారు.

సోషల్ మీడియా ప్రభావం

ఈ కాలంలో పిల్లల చేతులలో మొబైల్ తప్పనిసరి పరికరమైంది. అదే ఇప్పుడు వారి జీవితాలను ప్రమాదంలో పడేస్తోంది. రాత్రిపూట చాటింగ్‌లు, రీల్స్, ఫ్రెండ్ రిక్వెస్టులు ఇవి చిన్న వయసులో మనసును మాయ చేస్తాయి. ప్రేమ అనే పదం అంటే ఏమిటో కూడా తెలియక ముందే పిల్లలు దానిని జీవితమని భావిస్తున్నారు. పాఠశాలలలో లేదా ఇంటిలో అవగాహన లోపంతో పిల్లలు భావోద్వేగాలను నియంత్రించలేకపోతున్నారు. ఒకరి ప్రేమను పెద్దలు వ్యతిరేకిస్తే, 'నా ప్రేమను అడ్డుకున్నారు' అనే తప్పు భావనతో ఆత్మహత్య చేసుకునే ఘటనలు పెరుగుతున్నాయి. చాలామంది తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడటానికి సమయం కేటాయించడం లేదు. పిల్లలు ఏమనుకుంటున్నారు, వారు ఎవరితో మాట్లాడుతున్నారు, వారి మానసిక స్థితి ఏమిటి? ఈ విషయాలపై దృష్టి పెట్టడం లేదు. దీని ఫలితంగా పిల్లలు ఇంటిలో ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. ఆ ఖాళీని నింపే ప్రయత్నంలో తప్పుడు సంబంధాలకు లోనవుతున్నారు. సోషల్ మీడియా, సినిమాలు ప్రేమను ఆకర్షణీయంగా చూపించడం కూడా చిన్న వయసులో మతి పోగొట్టే స్థాయిలో ఉంది. 'ప్రేమ కోసం ఏమైనా చేస్తాం' వంటి డైలాగులు తాత్కాలిక భావనను శాశ్వత నిర్ణయంగా మార్చేస్తున్నాయి. దీని వలన కూడా అనేక విషాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పరిష్కార మార్గం

తల్లిదండ్రులు స్నేహితుల్లా ఉండాలి. పిల్లలతో మాట్లాడి వారిని అర్థం చేసుకోవాలి. గద్దించడం కాకుండా ప్రేమగా దారిచూపాలి. పాఠశాల స్థాయిలో కౌన్సెలింగ్ తప్పనిసరి



చేయాలి. మానసిక ఆరోగ్యం, భావోద్వేగ నియంత్రణ, బాధ్యతా సంబంధాలపై అవగాహన క్లాసులు అవసరం. మొబైల్ వినియోగం మీద నియంత్రణ ఉండాలి, పిల్లలకు అన్ లిమిటెడ్ యాక్సెస్ ఇవ్వకూడదు. సమయ పరిమితులు పెట్టాలి. సోషల్ మీడియా అవగాహన పెంచాలి, ఏ వీడియోలు చూడాలి, ఏ ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించాలి అనే దానిపై పిల్లలకు మార్గనిర్దేశనం చేయాలి. ప్రేమలో విఫలమయ్యామని ప్రాణం తీసుకోవడం సమస్య పరిష్కారం కాదని వారిని స్పష్టంగా చెప్పాలి. తల్లిదండ్రులు, గురువులు లేదా కౌన్సెలర్‌తో మాట్లాడడం ద్వారా ఏ సమస్యనైనా ఎదుర్కోవచ్చు. చిన్న వయసులో ప్రేమ భావన తాత్కాలికం మాత్రమే అని పిల్లలకు అర్థం అయ్యేలా వివరించాలి.

(వ్యాస రచయిత ఇండిపెండెంట్ జర్నలిస్ట్, గుండాల)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం





ప్రమాదానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి పరామర్శ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, చేవెళ్ల, నవంబర్ 7: కొద్ది రోజుల క్రితం చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం రాష్ట్ర ప్రజల హృదయాలను కలిచివేసింది. ఈ ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో గాయపడిన వారిని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం చేవెళ్ల ఆసుపత్రిలో శుక్రవారం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఈ ఘోర ప్రమాదానికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రోడ్డు బాగు చేయకపోవటమే ప్రాణనష్టం కలిగించిందన్నారు. రోడ్డును రిపేర్ చేయాలని చాలా రోజులుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారన్నారు. అయినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, అంతేకాకుండా, నిరసనగా ధర్నా చేసిన వారిపై కేసులు పెట్టడం దారుణమని ఆమె పేర్కొన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం ప్రకటించాలన్నారు. గాయపడిన వారికి రూ. రెండు లక్షలు అన్నారని, కానీ, వారు కూడా ఇప్పటివరకు ఆ సాయం అందుకోలేదని బాధితులు చెబుతున్నారన్నారు. గాయపడిన వారికి కనీసం రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మెయిలర్

- మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : జూబ్లీ హిల్స్ ప్రజలు ఇచ్చే తీర్పుతో రాష్ట్ర దశ, దిశా మారబోతోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం నాడు అయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి బ్రదర్స్ మాత్రమే సంతోషంగా ఉన్నారన్నారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలు ఇబ్బందులలో ఉన్నారన్నారు. 'కేసీఆర్ పాలనలో వికాసం, రేవంత్ రెడ్డి పాలనలో విధ్వంసం. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక వికాసానికి, విధ్వంసానికి మధ్య జరుగుతోంది. బీఆర్ఎస్ హయంలో 5,300 కోట్ల రూపాయలతో జూబ్లీ హిల్స్ లో అభివృద్ధి జరిగిందని' అన్నారు. రేవంత్ రెడ్డి ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వడం లేదని, రెండేండ్ల నుంచి కాలేజీ యాజమాన్యాలు కాళ్లకు చెప్పులు అరిగేలా తిరిగారని అన్నారు. కాలేజీ యాజమాన్యాలను రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయంలో 19 వేల కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించామన్నారు. ఆరోగ్య శ్రీ డబ్బులు చెల్లించకపోవడంతో బంద్ పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. హైడ్రా పేరుతో భట్టి విక్రమార్క ప్రెస్ మీట్ పెడితే రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలపై సంఘాలు నోరెత్తితే కేసులు పెడుతున్నారన్నారు. రెండేండ్లలో ఏం చేశారో జూబ్లీ హిల్స్ ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలన్నారు.



స్పోర్ట్స్ కోటా కింద పంచాయతీ కార్యదర్శుల ఎంపిక

- 10, 11 తేదీలలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేయనున్న తెలంగాణ జూనియర్ పంచాయతీ కార్యదర్శి పోస్టులకు సంబంధించిన సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఈ నెల 10, 11 తేదీలలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు సంబంధిత వివరాలతో ప్రకటన జారీ చేసారు. రెండు రోజుల పాటు సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ వెల్లడించింది. అభ్యర్థులు తమతోపాటు రాత పరీక్ష హాల్ టికెట్, పదో తరగతి, ఇంటర్, డిగ్రీల సర్టిఫికెట్లు, ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి చదివినట్లు ధ్రువీకరించే లోకల్ సర్టిఫికెట్, ప్రభుత్వ ఉద్యోగులైతే నో అబ్జక్షన్ సర్టిఫికెట్.. సర్వీస్ సర్టిఫికెట్లు, స్పోర్ట్స్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులు తీసుకెళ్లాలి. ఒరిజినల్ పత్రాలలు, జిరాక్స్ సెట్లు కూడా తమతోపాటు తీసుకెళ్లవల్సి ఉంటుంది. 2019లో కోర్టు వివాదాల నేపథ్యంలో స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన అభ్యర్థులను తొలగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు వారితో పాటు కొత్తగా ఎంపికైన 172 మందికి కూడా సర్టిఫికేట్లను పరిశీలించనున్నారు.



డీసీఎంను కలిసిన అరుంధతీ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : వుమెన్ క్రికెట్ ప్లేయర్ అరుంధతి రెడ్డి శుక్రవారం సాయంత్రం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసింది. ఇటీవల జరిగిన వుమెన్ వరల్డ్ కప్ లో తనదైన పాత్ర పోషించిన అరుంధతి రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, వీసీ అండ్ ఎండి సోనీ బాలదేవి, కోచ్ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేద వడ్డెర్లకు ఇందిరమ్మ ఇండ్లు

- వడ్డెరలకు అండగా ఉండేది కాంగ్రెస్
- త్వరలో వారందరికి పక్కా ఇండ్ల నిర్మాణం
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సీతక్క వెల్లడి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ జయశంకర్ కమ్యూనిటీ హాలులో వడ్డెరల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు డా. సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజారుద్దీన్, డిప్యూటీ స్పీకర్ రామచంద్రూ నాయక్, ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా ఎఫ్ఫెనెండి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జేరిపాటి జైపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రక్తం చెమట చిందించి రాళ్లను కరిగించి పటిష్ట నిర్మాణాలు చేసిన వడ్డెరలు హైదరాబాద్ నగర అభివృద్ధికి వెన్నెముకలని పేర్కొన్నారు. పీజేఆర్ హయాంలో వడ్డెరలకు ఇండ్ల పట్టాలు ఇచ్చారని, బీఆర్ఎస్ పాలనలో వాటిని లాక్కున్నారని ఆరోపించారు. వారికి ఇప్పుడు పక్కా ఇల్లు కట్టించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. కాంగ్రెస్ అంటే పేదల పార్టీ అన్నారు. గ్రామాలు, పట్టణాలలో పేదలకు ఇండ్లు కట్టించి ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. పేదల కడుపునిండా సన్నబియ్యం పెడుతున్న పెద్దన్న రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలన్నది రాహుల్ గాంధీ లక్ష్యమని, అది రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నెరవేర్చుతుందని అన్నారు.



నవీన్ యాదవ్ విజయం ఖాయం

- అన్నివర్గాల ప్రజలు అండగా నిలవాలి
- మైనారిటీల సమ్మేళనంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ విజయం ఖాయమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఇది బీసీ, మైనారిటీల ఆత్మ గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన షేక్ పేటలో జరిగిన మైనారిటీల సమావేశంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్నారని అన్నారు. జనాభా ప్రాతిపదికన కులాలవారీగా వాటా ఇవ్వాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనల మేరకే ఒక బీసీ బిడ్డ కు జూబ్లీహిల్స్ లో టికెట్ ఇచ్చామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు బీసీ రిజర్వేషన్లు కల్పించడంలో శాయశక్తులా, శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. మైనారిటీలు, బీసీలు కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా అండగా ఉండాలిలన్నారు. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా మైనారిటీలకు కాంగ్రెస్ ఇస్తున్న ప్రాధాన్యతను చూపించామన్నారు. ఈ సమావేశంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలన కేసీఆర్ కుటుంబ పాలన

- మండిపడిన ఎమ్మెల్సీ విజయశాంతి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 7 : బీఆర్ఎస్ పాలన కేసీఆర్ కుటుంబ పాలనగా సాగిందని, పదేండ్లు తెలంగాణ ప్రజలను పీక్కుతిన్నారని ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. శుక్రవారం నాడు ఆమె ఎంపీ మల్లు రవితో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్ లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ తెలంగాణలో అప్పులు చేసి ప్రజలకు తిప్పలు తెచ్చారన్నారు. పదేండ్లు తెలంగాణను అభివృద్ధి చేయకుండా దోచుకుని తినడానికే సరిపోయిందన్నారు. చదువుకున్న వ్యక్తి నవీన్ ను దొంగ రౌడీ అని అంటున్నారని, వారి కంటే దొంగలు లున్నారా ఈ దేశంలో! అని ప్రశ్నించారు. 11న జరిగే ఎన్నికలలో చేతి గుర్తు పైన ఓటు వేసి నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. వారి వెంట మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్యేలు రామచందర్ నాయక్, మందుల సామేలు, నవీన్ యాదవ్, బాబా ఫసియోద్దీన్, స్థానిక నాయకులు ఉన్నారు.




గ్రామాబివృద్ధికి మా వంతు కృషిచేస్తాం

- యువనాయకులు షాపురం రాజు(మాణిక్యం)

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 7 : రెడ్డిపల్లి గ్రామాబివృద్ధికి తనవంతు కృషిచేస్తానని యువనాయకులు షాపురం రాజు (మాణిక్యం) అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలోని పలు వీధుల్లో సొంత నిధులు రూ.12లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజల ఇబ్బందులు తొలగించాలనే ఉద్దేశంతో ప్రజా సౌకర్యం కోసం తన సొంత డబ్బులతో సీసీ రోడ్డు వేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేద ప్రజలకు నిత్యం అండగా ఉంటున్న షాపురం రాజు (మాణిక్యం) రెడ్డిపల్లి ప్రజలు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు మామిడి శ్రీనివాస్ రెడ్డి, ,కుండె అంజయ్య, కాంత్ రెడ్డి, చిన్నయ్య గారి సత్యనారాయణ రెడ్డి, మోర మల్లేష్ ,కుండె యాదగిరి, చిలుకూరి శ్రీశైలం,కుండె రాంచందర్, చాకలి నర్సిములు,శంకరయ్య,కుండె గణేష్, కుండె సుధాకర్, షాపురం రాంచందర్, కావలి యాదగిరి, గడ్డం సామయ్య,సుజయ్య, పీ.సుధాకర్, ఇంద్రసేన రెడ్డి,గడ్డం రాములు, ఎర్ర బుచ్చయ్య, ఎర్ర వెంకటయ్య,చిలుకూరి రాములు, చిలుకూరి వెంకటేష్, యాదయ్య ,మొల్గారి మల్లేష్, మొల్గారి యాదయ్య, డప్పు శ్రీను, కత్తుల శంకరయ్య తదితర గ్రామ మహిళలు, యువకులు పాల్గొనారు.

ఓయూ కాలనీ టూ సీబీఎస్‌కు ఆర్టీసి బస్‌సర్వీస్




ప్రతిపక్షం, జూబ్లీహిల్స్, నవంబర్ 7: ఓయూ కాలనీ నుంచి సీబీఎస్‌వరకు ఆర్టీసి బస్‌సర్వీసును ప్రారంభించారు. ఓయూ కాలనీ వాసుల అభ్యర్థన మేరకు మంత్రి వికేక్ ఓయూ కాలనీ నుంచి సీబీఎస్‌వరకు ఆర్టీసి బస్ సర్వీసును ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఓయూ కాలనీ నుంచి సీబీఎస్‌వరకు 118ఎం/217సీ సర్వీసును అధికారుల శుక్రవారం ప్రారంభించారు. గతంలో సీబీఎస్‌కు వెళ్లాలంటే రెండు బస్సులు మారాల్సి వచ్చేదని కాలనీ వాసులు అన్నారు. బస్సు సౌకర్యం కల్పించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ కు కృతజ్ఞతలు తెలిపారు.



నవీన్‌యాదవ్ కు మద్దతు తెలిపిన మాజీ ఆర్మీ అధికారులు

ప్రతిపక్షం, జూబ్లీహిల్స్, నవంబర్ 7: జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతు తెలుపుతూ మాజీ ఆర్మీ అధికారులు మంత్రి వివేక్‌ను ఓయూ కాలనీలో కలిశారు. మంత్రిని కలిసిన వారిలో ఎక్స్ సర్వీస్ మెన్, మాజీ మున్సిపల్ చైర్మన్ పి. రాజేంద్రన్, పి. పెంటారెడ్డి టీపీసీసీ ఎక్స్ సర్వీస్ మెన్ సెల్ డిస్ట్రిక్ట్ చైర్మన్, కంబైన్డ్ డిఫెన్స్ ఎక్స్ సర్వీస్మెన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ పి. గుణశేఖర్, ఎక్స్ సర్వీస్మెన్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే జె. శ్రీనివాస్, ఎక్స్ సర్వీస్ మెన్ ఆర్గనైజర్ అమల్ రాజ్, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ జనరల్ సెక్రెటరీ జీఆర్ కిషన్ రావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌నియోజవర్గంలో కాంగ్రెస్‌పార్టీ గెలుపు ఖాయమని అన్నారు.



ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జూబ్లీహిల్స్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే. ఈ ఉప ఎన్నికలో ఓటర్లు బీజేపీ, బీఆర్ఎస్ కు గుణపాఠం చెబుతారు. తొమ్మిదేళ్లలో హైదరాబాద్ అభివృద్ధిని బీఆర్ఎస్ గాలికొదిలేసింది. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న నవీన్ యాదవ్‌ను గెలిపించాలి.

- మంత్రి శ్రీధర్ బాబు

ప్రాంతీయం



పాఠశాలలో పారిశుధ్య సమస్యపై కలెక్టర్ ఆగ్రహం

- పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి ని సస్పెన్షన్ చేయాలని ఆదేశం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 7 : సంగారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ సమస్యపై కలెక్టర్ పి. ప్రావీణ్య, ప్రధానోపాధ్యాయులు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంగారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల్లో శానిటేషన్ సమస్య, ఎఫ్ఆర్ఎస్ సిస్టం సరిగా అమలు చేయకపోవడం పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా పాఠశాలలో మూత్రశాలలు మరుగుదొడ్లను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడం తో పాటు , పాఠశాలలో శానిటేషన్ సమస్య కలెక్టర్ దృష్టికి రావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని సస్పెన్షన్ చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ను ఆదేశించారు . పాఠశాలలో సానిటేషన్ సిబ్బందిని తొలగించి నూతన శానిటేషన్ సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించారు . ఎఫ్ఆర్ఎస్ సిస్టం పూర్తిస్థాయిలో అమలు అయ్యేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణులు అయ్యేలా ఇప్పటి నుండే ఉపాధ్యాయులు, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు సిబ్బంది కృషి చేయాలని ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

సునిత కన్నీళ్లను కూడా రాజకీయం చేశారు

- ఇన్ని రోజులు మంత్రులు వచ్చారా?
- ఆలోచన చేయండి.. సిగ్గు లేకుండా ఓట్లు అడుగుతున్నారు..
- అన్నం పెట్టిన కేసీఆర్‌ను మర్చిపోతమా?
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం



ప్రతిపక్షం, సంగారెడ్డి, నవంబర్ 7: మాగంటి గోపీనాథ్ భార్య కన్నీళ్లు పెట్టుకుంటే కాంగ్రెస్ నాయకులు దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ వాళ్లు చనిపోతే భార్యలు ఏడుస్తారా లేదా? ఆ తల్లిని పట్టుకుని దుర్మార్గంగా మాట్లాడారని మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని కొల్లూరు కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇక్కడికి వస్తే కుర్చీలు ఖాళీ ఉన్నాయని, నేడు మన మీటింగ్‌కు మూడుసార్లు కుర్చీలు తెప్పించినా సరిపోవడం లేదని అన్నారు. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్స్‌కు పేరు కేసీఆర్ నగర్ అనే పేరు పెట్టుకున్నాం. ఇన్ని రోజులు మంత్రులు వచ్చారా? ఆలోచన చేయండి.. సిగ్గు లేకుండా ఓట్లు అడుగుతున్నారు.. అది ఇస్తాం, ఇది ఇస్తాం అని ప్రలోభాలు చేస్తున్నారు.. అన్నం పెట్టిన కేసీఆర్‌ను మర్చిపోతమా? అని అన్నారు. కలలో కూడా కలగనని ఇళ్లలో ఉంటామని అనుకోలేదు. మీ ఓట్లు ఖాయంగా కేసీఆర్‌కే అని అర్థ అయ్యింది. మీ బంధువులకు కూడా చెప్పి కేసీఆర్‌కు కారుకు ఓటేయమ్మని చెప్పండి అని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు రెఫరెండం అని చెప్పే ధైర్యం లేదని, మంత్రులు జూపల్లి కృష్ణారావుకు, పొన్నం ప్రభాకర్‌కు జూబ్లీహిల్స్ ఓటర్లు చుక్కలు చూపించారని అన్నారు. ఓటుకు రూ.3వేలు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నదని, తీసుకుని మిగతా రెండేళ్లలో ఇస్తామన్న డబ్బులు కూడా అడగండని అన్నారు. 2,500 లేదు, మహాలక్ష్మి స్కీమ్ లేదు, తులం బంగారం లేదు, స్కూటీ లేదు.. సిగ్గు లేకుండా మళ్లీ ఏదో చేస్తా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. తులం బంగారం అడిగితే ఓ మంత్రి లక్ష దాటింది ఎక్కడ ఇస్తాం అని మాట్లాడుతున్నాడని అన్నారు. రేవంత్ రెడ్డికి కేసీఆర్ చేసిన అభివృద్ధి కనపడటం లేదంటే.. ఆయన అంధుడు అయిన ఉండాలే.. లేదంటే పిచ్చోడు అయిన ఉండాలని అన్నారు. ముస్లింలు సహాయం చేసిన వారిని జీవితంలో మర్చిపోరని, హిందూ అయినా ముస్లిం అయిన కేసీఆర్‌కు ఒక్కటే అని అన్నారు. కాంగ్రెస్ లేకపోతే ముస్లిం లేరు అని రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై యావత్ తెలంగాణ ముస్లింలకు క్షమాపణ చెప్పాలని అన్నారు.



వందే మాతరం స్ఫూర్తిదాయకమైన జాతీయ గీతం

- భారతీయుల హృదయాల్లో దేశప్రేమను రగిలించే ఉద్యమ నినాదం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 7 : వందే మాతరం జాతీయ గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిబ్బందితో కలిసి వందేమాతర గీతాన్ని ఆలపించారు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వందే మాతరం జాతీయ గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంవత్సరం పొడువున అనగా 2025 నవంబర్ 7 నుండి 2026 నవంబర్ 7 వరకు స్మారక కార్యక్రమాల ద్వారా వందేమాతరం 150వసంతాల ఉత్సవాలను జరుపుకోవాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలోసిబ్బందితో కలిసి వందేమాతరం జాతీయ గీతం ఆలపించడం జరిగిందని అన్నారు. వందేమాతర గీతాన్ని బంకిమ్ చంద్ర చటర్జీ గారు 1875లో రాశారు. "వందే మాతరం" అంటే “మాతృభూమికి వందనం”, అని అర్థం. “వందే మాతరం” నినాదం బ్రిటిష్‌పాలనకు వ్యతిరేక పోరాటంలో ఒక స్ఫూర్తి నినాదంగా నిలిచింది. 1905లో బెంగాల్ విభజన సమయంలో ప్రజలు ఈ నినాదాన్ని పాడుతూ బ్రిటిష్ వ్యతిరేక ఆందోళనలు చేశారు. బాల గంగాధర తిలక్, లాలా లజపతరాయ్, అరవిందఘోష్, బిపిన్ చంద్ర పాల్ వంటి నేతలు ఈ గీతాన్ని ప్రజల్లో తీసుకెళ్లారు. స్వాతంత్ర్య అనంతరం 24 జనవరి 1950 లో భారత రాజ్యాంగ సభ “వందే మాతరం” ను జాతీయ గీతంగా గుర్తించిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్ రావ్, ఎఆర్ డిఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్స్ రమేష్, కిరణ్ కుమార్, నాగేశ్వర్ రావ్, ఆర్ఐ లు రామారావ్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, శ్రీనివాస్ రావ్, ఆఫీసు సూపరిడెంట్స్ అశోక్, మెహనప్ప, డీపీఓ సిబ్బంది తదితరులు ఉన్నారు.



వందేమాతరం గేయంలోని ప్రతి పదం
దేశభక్తి భావనతో నిండి ఉంటుంది

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 7 : జాతీయ గీతాన్ని మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సామూహిక గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్యఅథిదిగా పాల్గొని , విద్యార్థులతో కలిసి సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వందేమాతరం గేయంలోని ప్రతి పదం దేశభక్తి భావనతో నిండి, భారతదేశం ఒకటే అని గర్వంగా చెబుతుందని అన్నారు. ఈ గీతం మన దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, ప్రతి విద్యార్థి ఈ భావనను మనసులో నిలుపుకోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజు పాఠశాలలో వందేమాతరం గేయాన్ని ఆలపించడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యత భావాలు మరింత బలపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు ఈ గీతం ద్వారా దేశ సేవా స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .

వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి



ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 07: వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం గుండ్ల పోచంపల్లి బీజేపి నాయకులు సామూహిక వందేమాతరం ఆలపించారు, ఈ సందర్భంగా అమరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర సమరానికి సంకేతమైన శబ్దం, దేశం మొత్తం ఒకటే, హృదయం ఒకటే, శ్వాస అవడానికి కారణమైన గొప్ప శక్తి వందేమాతర గీతమని అన్నారు. బ్రిటీషర్లను వందేమాతరం అనే మాటే బయపెట్టిందని, ఇప్పటికి వందేమాతరం ఆలపించిన నరనరాన దేశభక్తి నిండుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి, మున్సిపల్ అధ్యక్షులు కావేరి శ్రీధర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి చింతలపూడి రామారావు, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు బట్టికడి నవనీత, సురేష్ ముదిరాజ్, సుంకు నవీన్, బట్టికడి విక్రమ్, ప్రవీణ్ గౌడ్, అభిలాష్, అరుణ్ కుమార్, మరియు ఉపధ్యాల బృందం, విద్యార్థి విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.







వందేమాతరం
గీత ఆలాపన

ప్రతిపక్షం,మొయినాబాద్, నవంబర్ 7 : వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మొయినాబాద్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం అధికారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వందేమాతరం ఉద్దేశం, గీతం దేశానికి ఉపయోగపడ్డ తీరును వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నవీన్ యాదవ్ గెలుపుతో కొత్త చరిత్ర సృష్టించబోతున్నాం

- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 7 : జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పెద్ద మెజార్టీతో గెలుపొందడం ఖాయమని దీంతో కొత్త చరిత్ర సృష్టించ బోతున్నామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం ను రాజేందర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ లో రాజేందర్రావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని తెలిపారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు అభివృద్ధికి మలుపు అని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పరిధిలోని ఓటర్లందరూ అత్యధిక మెజార్టీతో నవీన్ యాదవ్ గెలిపించాలని రాజేందర్రావు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మూల వెంకట రవీందర్ రెడ్డి, లక్ష్మణ్ రాజ్, వజీర్ భాయ్ అనంతుల రమేష్, బట్టు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



యాక్సిడెంట్ లకి అడ్డాగా మారిన బీజాపూర్ హైవే

- హిమాయత్ నగర్ వద్ద మరో బస్సు ప్రమాదం

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్7: బీజాపూర్ రహదారిపై మరో ప్రమాదం చోటు చేసుకుంది, ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీలోని హిమాయత్ నగర్ ఇండియన్ పెట్రోల్ బంక్ ముందు జరిగింది, శుక్రవారం సాయంత్రం వేళలో ముందు వెళ్తున్న బస్సును మరో బస్సు వెనుక నుండి ఢీకొనడంతో బస్సు ముందు భాగం నుజ్జుగా అయింది, భాస్కర్ మెడికల్ కాలేజీకి చెందిన బస్సు TS 07 UA 2182 బస్సు వెనుక నుండి మరో బస్సులో ఢీ కొట్టింది, ఈ ప్రమాదంలో విద్యార్థులకి ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు, బస్సు ముందు బాగా నజ్జునుజగా మారింది, బస్సులో ఉన్న విద్యార్థులను మరో బస్సులో పంపించారు, బీజాపూర్ హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి, అవి కూడా బస్సులకే జరుగుతుండడంతో జనాలు భయంతో అధోలన చెందుతున్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం బీజాపూర్ హైవే పనులు పూర్తి చేయాలి,

చెరువును కాపాడారు.. వరద ముప్పు తప్పించారు

- భవిష్యత్తుకు బాటలు వేస్తున్న హైడ్రాకు ధన్యవాదాలు
- హైడ్రాకు బాసటగా ర్యాలీలు నిర్వహించిన ప్రజలు



ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 7: మా చెరువును కాపాడారంటూ కొన్ని కాలనీల ప్రజలు, మాకు వరద ముప్పు తప్పించారని మరి కొన్ని కాలనీల నివాసితులు హైడ్రాకు శుక్రవారం అభినందనలు తెలిపారు. భవిష్యత్ తరాలకు బాటలు వేస్తున్న హైడ్రాకు పలు కాలనీల ప్రజలు బాసటగా నిలిచారు. హైడ్రా వచ్చింది మా కష్టాలు తీర్చిందంటూ పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. వరద కష్టాలను తాము నేరుగా చూశాం.. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే ఆ సమస్యను పరిష్కరించిన తీరును కూడా గమనించాం..దశాబ్దాల సమస్యకు ఇంత త్వరగా పరిష్కారం దొరుకుతుందని తాము ఊహించలేదంటూ పలువురు హైడ్రాకు అభినందనలు తెలిపారు. ర్యాలీలు తీసి, హైడ్రాకు అభినందనలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. బాగ్‌లింగంపల్లి శ్రీరాంనగర్ బస్తీ కష్టాలు వర్ణనాతీతం.. 5 సెంటీమీటర్ల వర్షం పడితే ఈ బస్తీని వరద ముంచెత్తుతుంది. నడుం లోతు నీటిలో ఇళ్లకు చేరడం గగనం. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే వచ్చి హుస్సేన్ సాగర్ ప్రధాన వరద కాలువకు అనుసంధానం చేయడంతో సమస్య పరిష్కారమైంది. ఇక్కడ స్థానిక ప్రజాప్రతినిధి వరద కాలువను ఆక్రమించి మళ్లించడం వల్లే ఈ సమస్య తలెత్తిందనగానే వెంటనే ఆ సమస్యను పరిష్కరించిన హైడ్రాకు ధన్యవాదాలంటూ ర్యాలీ నిర్వహించి మద్దతు పలికారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీ దేవరయాంజల్ విలేజ్‌లోని తురకవాణికుంట నుంచి దేవరయాంజల్ చెరువుకు వెళ్లే వరద కాలువ 6 మీటర్ల వెడల్పుతో ఉంటుంది. అక్కడ కొంతమంది ఆ నాలాను కేవలం 2 ఫీట్ల పైపులైను వేసి మిగతా భూమిని కబ్జా చేయడంతో తమ ప్రాంతాలన్నీ నీట మునుగుతున్నాయని హైడ్రాకు ఫిర్యాదు చేశాం. నెల రోజుల్లో సమస్యను పరిష్కరించిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

ముష్కిన్ చెరువును కాపాడిన హైడ్రాకు ధన్యవాదాలు

ముష్కిన్ చెరువును కాపాడిన హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఉదయం ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరిట చెరువు ముష్కిన్ చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో మట్టి పోసి బండ్ నిర్మాణం చేపట్టడంతో సరస్సు సహజ ప్రవాహం ఆగిపోగా, చెరువు నీరు కాలుష్యానికి గురైంది. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముష్కిన్ చెరువు మత్స్యకారుల జీవనాధారంగా ఉండేది. వారు తరతరాలుగా ఇక్కడ చేపల వేట చేసేవారు. ఆ కాలంలో వారి కుటుంబాలు కూడా ఈ సరస్సు నీటినే తాగేవారు. కానీ ఇటీవల కాలంలో సరస్సు కాలుష్యానికి గురై జీవవైవిధ్యం కోల్పోయింది. మా ఫిర్యాదుతో హైడ్రా అధికారులు వెంటనే స్పందించి, ఎఫ్ టి ఎల్ పరిధిలో పోసిన మట్టిని పూర్తిగా తొలగించారు. చెరువు సహజ పరిమాణం పునరుద్ధరించడంతో సరస్సు తిరిగి తన పాత అందాన్ని సంతరించుకుంది. మాకెంతో ఆనందంగా ఉంది.. చెరువును కాపాడిన హైడ్రాకు కృతజ్ఞతలంటూ మత్స్యకారులు, స్థానికులు హైడ్రా చర్యలను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి నీటి వనరులను రక్షించాలనే తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు.

“



రిజర్వ్ బ్యాంక్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్, విధానపరమైన నిర్ణయాలే దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశాయి. ఆర్బీఐ చేపట్టిన సంస్కరణల వల్లే 2018లో నష్టాల్లో ఉన్న ఎస్బీఐ ఇప్పుడు 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరింది. 27గా ఉన్న పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను 12కి తగ్గించడం కూడా బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి కారణం.

- ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

భవిష్యత్తు తరాలు ఎప్పటికీ

'వందేమాతరం' గొప్పతనాన్ని స్మరించాలి

- జిల్లా కలెక్టర్ హైమవతి



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 7: భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో దేశంలోని అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల ప్రజలను ఏకం చేయడంలో ముఖ్య పాత్ర పోషించింది వందేమాతరం గీతం అని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. ప్రభుత్వ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వందేమాతర గీతం సామూహిక ఆలాపన కార్యక్రమాన్ని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిష్ వారు భారతదేశంలోని ప్రజలను కులాలు, మతాలు, ప్రాంతాలవారీగా విభజించి పాలిస్తున్న సమయంలో 150 సంవత్సరాల క్రితం దేశంలోని కవులందరూ ప్రజలను ఏకం చేసే అనేక ప్రయత్నాలను చేశారు. దానిలో భాగంగా బంకించంద్ర చటర్జీ బెంగాలీలో ఆనందమట్ గ్రంథంలో వందేమాతరం గీతాన్ని రచించడం జరిగిందని అన్నారు. మనము భూమిని మాతతో పోలుస్తాము కాబట్టి భారత్ దేశాన్ని కూడా మాతగా భావిస్తూ వందేమాతరం గీతాన్ని దేశ ప్రజలను ఐక్యం చేయడానికి రచించారని అన్నారు. వందేమాతర గీతం ఆనాడు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరినీ ఏకం చేసి ఉత్తరం నుంచి దక్షిణం వరకు, తూర్పు ఉండి పశ్చిమ వరకు దేశాన్ని సమైక్యం చేయడానికి ఎంత దూరం పడిందని, బెంగాల్ విభజన సమయంలో జరిగిన వందేమాతరం ఉద్యమంతో పాటు స్వాతంత్ర ఉద్యమంలోని క్విట్ ఇండియా, దండి యాత్ర తదితర అన్ని ఉద్యమాలలో ఒక ముఖ్య నినాదం గా వందేమాతరం నిలిచిందని అన్నారు. మతాలు, భాషలు, ప్రాంతాలు వేరైనా మనమందరం భారతీయులం అనే భావాన్ని మనందరిలో కలుగజేస్తూ స్ఫూర్తి నింపిన వందేమాతరం గీత ఔన్నత్యాన్ని, దేశ గౌరవాన్ని కాపాడుతూ దాన్ని రచించిన బంకించంద్ర చటర్జీని స్మరిస్తూ భవిష్యత్తు తరాలు వందేమాతరం గీతం గొప్ప తనాన్ని ఎప్పటికీ స్మరించేలా అందరం కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ మరియు వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



10న నాచగిరిలో విశేష కార్యక్రమాలు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 7: కార్తీకమాసం 17వ రోజు పురస్కరించుకుని వర్గల్ మండలం, నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కార్తీక దీపారాధన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. అంతే కాకుండా ఈనెల 10 సోమవారం రోజున తెలంగాణ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశానుసారం కార్తీకమాస విశేష ఉత్సవాలతో పాటు సాయంత్రం గంగా హారతి నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి విజయరామారావు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అశేష సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పారదర్శకంగా ఓటర్ లిస్ట్ తయారీ

- జిల్లా కలెక్టర్ హైమవతి



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 7: ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఎలెక్టోరల్ రూపొందించడం కోసం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ లతో సమావేశం నిర్వహించామని జిల్లా కలెక్టర్ హైమవతి తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో జిల్లాలో ఓటర్ సర్వే కొరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కె హైమావతి జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం ప్రజాస్వామ్యంలో ఓటర్ లిస్ట్ అత్యంత పారదర్శకంగా తయారుచేయడానికి నియోజకవర్గం వారిగా ఒక్కో రాజకీయ పార్టీ నుండి బీఎల్ఏ ను అపాయింట్ చెయ్యాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ స్టేషన్ వారిగా ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త ఓటర్లు, షిఫ్టెడ్ ఓటర్లు, డెత్ ఓటర్ల లిస్ట్ లను ప్రభుత్వ బి ఎల్ ఓ, రాజకీయ పార్టీల బీఎల్ఏ లు కలిసి ఓటర్ లిస్ట్ తయారు చేసి సంబంధిత ఏఈఆర్ఓ లేదా ఈఆర్ఓకీ అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఏంఐఎం, సిపిఎం, వైఎస్ఆర్ సీపీ, వివిధ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మలావత్ పూర్ణకు పితృవియోగం

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 7 : అత్యంత చిన్న వయస్సులో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ తండ్రి దేవీదాస్ (50) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కోమాలో ఉన్నారు. ఆయన అంత్యక్రియలు స్వస్థలమైన సిరికొండ మండలం పాకాలలో సాయంత్రం ముగిశాయి. ఈ సందర్భంగా పలువురు మాలవత్ పూర్ణ ను పరమార్శించారు.



ఎన్ఎఫ్బీఎస్ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల విన్నపం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 7: జిల్లాలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాలు విన్నవించాయి.శుక్రవారంనాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం లో రైతు స్వరాజ్య వేదిక,దళిత బహుజన ఫ్రంట్,కేరింగ్ సిటిజన్ కలెక్టివ్ సంస్థల ప్రతినిధులు కలెక్టర్ ను కలిసి జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని వినతిపత్రం సమర్పించడం జరిగింది. జిల్లా లో ఈ పథకంపై ప్రజలకు అవగహన కల్పించడం లో అధికార యంత్రాంగం విఫలమైనదని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. పథకం పై ప్రచారం చేయాలని కోరారు. 87 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 39 మందికి మాత్రమే మంజూరు చేశారన్నారు.దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కుటుంబ పెద్ద దిక్కు ను కొల్పోయిన కుటుంబ సభ్యులు జాతీయ కుటుంబ ప్రయోజన పథకము కింద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కలెక్దర్ సానుకూలంగా స్పందించారన్నారు.కలెక్టర్ ను కలిసిన అనంతరం ఏఓను కలిసి పథకం అమలు పై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు కొండల్ రెడ్డి ,సిసిసి నాయకులు సుజాత శ్వేత,డిబిఎఫ్ నాయకలు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- కపాస్ కిసాన్ యాప్ ను రద్దుచేసి రైతాంగానికి న్యాయం చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్
- జిల్లా కలెక్టర్ కు సీపీఐ ఆధ్వర్యంలో వినతి

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 7: పత్తి రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పాత పద్ధతిలో సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కపాస్ కిసాన్ యాప్ ను రద్దు చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతిని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ కోరారు. శుక్రవారం రోజున కలెక్టరేట్లో ఆయన కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పత్తి పంట దెబ్బతినడంతో రైతాంగానికి తీవ్ర నష్టంతో ఆందోళన చెందుతున్న క్రమంలో లక్షల్లో పెట్టుబడులు పెట్టి పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కపాస్ యాప్ ద్వారా రైతులు స్మార్ట్ ఫోన్ లో ఒకరోజు ముందు స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. గతంలో ఎకరానికి 12 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సిసిఐ, ఈసారి 7 క్వింటాళ్లకు కుదించడం రైతు కు తీవ్ర నష్టం చేకూరుతుందని,పత్తికి తేమ శాతం 12 నుంచి 20శాతానికి పెంచాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసే ఆంక్షలు పెట్టి మరోసారి నడ్డి విరిచే విధంగా రైతన్నకి వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఈ కపాస్ యాప్ ను ఎత్తివేసి నేరుగా పాత పద్ధతిలోనే పత్తిని కొనుగోలు చేయాలని కలెక్టర్ ను వారు కోరారు..ఈ సందర్భంగా కలెక్టర్ హైమవతి స్పందిస్తూ రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని,సీసీఐ కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తామని చెప్పినట్టు మంద పవన్ తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ లో నవీన్ యాదవ్ దే గెలుపు

- టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 7: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీ తో గెలుస్తాడని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఎర్రగడ్డ, మోతినగర్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ఇందుకోసం నవీన్ యాదవ్ గెలిపించుకుని అభివృద్ధి చేసుకోడానికి సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెలికాని యాదగిరి, అనరాజు నాగరాజు, బాగు శ్రీకాంత్ యాదవ్, రాగుల కృష్ణ, చేర్యాల బాలయ్య, కరెడ్ల వెంకట్ రెడ్డి, తుపాకుల శ్రీనివాస్, బస్వరాజు రాములు, శ్రీనివాస్ రెడ్డి, ఆరెపల్లి సురేశ్, జయపాల్ రెడ్డి, ముక్కెర లింగం యాదవ్, శేఖర్ రెడ్డి, రాజు, శ్రీకాంత్, ఐలయ్య, ఐలేని యాదగిరి గౌడ్, రజినీకాంత్ పాల్గొన్నారు.



దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

- వడ్డెర సంఘం డిమాండ్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 7: మేడిపల్లి గ్రామానికి చెందిన వడ్డెర కులస్థుడు కుంచం రవిపై మందపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల గాంధీ రెడ్డి దాడి చేసి, వడ్డెర జాతిని అవమానించే విధంగా పదజాలం ఉపయోగించడం తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. వడ్డెర సంఘం నాయకులు గురువారం సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కుంచం శేఖర్ మాట్లాడుతూ జాతి పేరుతో అవమానించడం, దాడులు చేయడం సహించేది కాదని, పోలీసులు నిష్పాక్షికంగా విచారణ జరిపి నిందితుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తాం," అని హెచ్చరించారు.బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంకటి నవీన్ గౌడ్, దళిత సంఘాల రాష్ట్ర ఐక్య సంఘం అధ్యక్షుడు బత్తుల చంద్రం తదితరులు సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వడ్డెర సంఘానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రామంచలో ఘనంగా వందేమాతరం ఉత్సవాలు

- 150 ఆకృతిలో ఆకట్టుకున్న విద్యార్థులు

ప్రతిపక్షం, చిన్నకోడూరు, నవంబర్ 7: వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల ఉత్సవాల సందర్భంగా మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో 150 సంవత్సరాల జ్ఞాపకంగా సంఖ్య ఆకారం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాంసాని వెంకట సురేశ్ కుమార్ ఉపాధ్యాయులు అబేధా బేగం, సునీత, నాగమణి, వరప్రసాద్, యాదయ్య, స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.



డేటా ఆధారిత పాలన అంటూ ప్రచారమే తప్ప సీఎం చంద్రబాబు చేసిందేమీ లేదు. 500 వాట్సాప్ సేవల ద్వారా ఆన్లైన్లోనే సమస్యలన్నిటినీ పరిష్కరిస్తున్నామని చెబుతున్నారు. మరి లోకేశ్ ప్రజాదర్బార్‌కు 4వేల అర్జీలు ఎందుకు వచ్చాయి? ప్రతిసారీ ఓ కొత్తపదంతో పబ్లిసిటీ చేసుకుంటూ మోసగించడం చంద్రబాబుకు అలవాటు. సచివాలయం వంటి వ్యవస్థలను తెచ్చి జగన్ చరిత్రలో నిలిచారు.

\- ఏపీ మాజీ మంత్రి కన్నబాబు

ఎవరి కర్తవ్యం వారు నిర్వర్తించడం కూడా దేశభక్తే

- పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 7: అందరూ దేశభక్తి అని దేశ సరిహద్దుకి వెళ్లి యుద్ధం చేయాలనే కాదనీ, ఎవరి కర్తవ్యం వారు నిజాయితీగా నిర్వర్తించడం కూడా దేశభక్తే అని పోలీస్ కమిషనర్ విజయ్ పేర్కొన్నారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికీ జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న బంకించంద్ర చటర్జీ రచించిన అద్భుతమైన వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమంను తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం సిద్దిపేట వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాలాపన ఆలపించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దేశభక్తి అంటే ప్రతి పౌరుడు తన పని తాను సక్రమంగా క్రమశిక్షణతో ఎవరికీ ఎలాంటి ఆటంకం కలగకుండా చేయడం కూడా దేశభక్తి అన్నారు. ఒక రైతు పంట పండించి ప్రజలకి అన్న అందిస్తాడని, ఒక స్టూడెంట్ క్రమశిక్షణతో ఉండి చదువు నేర్చుకోవడం, ఉపాధ్యాయులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించి విద్యార్థులకు మంచిని నేర్పడం, ఒక ఆటో డ్రైవర్ నిజాయితీగా చార్జ్ చేస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థలానికి చేర్చడం, ఎవరైనా తెలియని వ్యక్తులు మర్చిపోయిన వస్తువులను తీసుకోకుండా తిరిగి అప్పచెప్పే గుణం కలిగి ఉండడం అదేవిధంగా పోలీసు వారు నిజాయితీగా విధులు నిర్వర్తించాలి అని, ఏ శాఖలోని వారు వారి కర్తవ్యాన్ని నియమాలు పాటించి పూర్తి చేయడం కూడా దేశభక్తి అని ఆయన అన్నారు.

స్వతంత్ర సంగ్రామంలో స్ఫూర్తినిచ్చిన వందేమాతర గీతం

- చేగుంట ఎస్సై, ఎంఈఓ నీరజ



ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 7: స్వాతంత్ర సంగ్రామంలో వందేమాతర గీతం స్ఫూర్తినిచ్చిందని చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి ఎంఈఓ నీరజ పేర్కొన్నారు. వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులతో కలిసి గీతాలాపన చేసిన అనంతరం వారు మాట్లాడారు. వందేమాతర గీతానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక చరిత్ర ఉందని భారత ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయడం ప్రజల్లో ఉత్తేజం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట సొసైటీ చైర్మన్ రఘురాములు లైబ్రేరియన్ గణేష్ ఉపాధ్యాయ సంఘం నాయకులు చల్లా లక్ష్మణ్, రావుల వెంకటేష్, గర్దాస్ మనోహర్ రావు, సరస్వతి, భవాని, ఉమాదేవి, రమా, శారద తదితరులు పాల్గొన్నారు.



నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 7: కాంట్రాక్టర్ లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎక్కువ కాలం ఉండే విధంగా నిర్మించేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ హైమవతి పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ చేపడుతున్న కార్యకలాపాలపై పంచాయతీ రాజ్ ఇంజనీర్ శాఖ ఈఈ, డీఈ, ఏఈ అందరితో జిల్లా కలెక్టర్ కె హైమావతి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజనీర్ శాఖ వారి ఆధ్వర్యంలో చేపడుతున్న ఏంజీ ఎన్ఆర్ఈజీఎస్ కింద మండలాల వారిగా చేపట్టిన పనులు యుద్ధ ప్రాతిపదకన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మాస్టర్ జెనరేట్ చేసి ఫిబ్రవరి లోపు అన్ని నిర్మాణంలో గల భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఆయా భవనాలకు స్థలం కొరత గల మండలాల్లో స్థల అన్వేషణ కొరకు ఆయా మండల తహసిల్దార్లను సంప్రదించాలని తెలిపారు. ఆయా స్థాయిలో పనులు పూర్తి కాగానే ఎఫ్ టి ఓ జెనరేట్ చెయ్యాలని తెలిపారు. కాంట్రాక్టర్ లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎక్కువ కాలం ఉండే విదంగా నిర్మించేలా పర్యవేక్షణ, చేసి సూచనలు చెయ్యాలని ఆదేశించారు .ఈ సమావేశం లో ఈఈ శ్రీనివాస్, డి ఈ చిరంజీవులు, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డి డబ్ల్యు ఓ శారద తదితరులు పాల్గొన్నారు.

యావత్ భారతాన్ని ఏకం చేసిన 'వందేమాతరం'

- అదనపు కలెక్టర్ నగేష్



ప్రతిపక్షం, మెదక్ ప్రతినిధి, నవంబర్ 7: యావత్ భారతాన్ని ఏకం చేసి భారతీయులందరిలో స్వాతంత్ర కాంక్షను రగిలించిన గీతం "వందేమాతరం" అన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో కలిసి వందేమాతరం గీతాలపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు, భారతదేశ చరిత్రలో వందే మాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా చేపడుతున్న వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యాలయంలో డీఆర్ఓ భుజంగరావు, కలెక్టరేట్ ఏవో యూనస్, డీఈఓ రాధా కిషన్, డీఆర్డీఏ పీడి శ్రీనివాసరావు, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఇతర జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో...

150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు మెదక్ జిల్లా కేంద్రంలో వందేమాతర గేయం సామూహికంగా విద్యార్థిని విద్యార్థులతో ఆలాపించడం జరిగిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతర గేయం రచించిన బంకించంద్ర చటర్జీని, స్వతంత్ర సమరయోధులను స్మరించుకోవడం జరిగిందని, వందేమాతర గేయం ప్రతి ఒక్కరికి రావాలని, భరత దేశ యువతకి వందేమాతర గేయంలోని అర్థం తెలియాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ గౌడ్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, జిల్లా నాయకులు లోకేష్, శివ, శ్రీనివాస్, సుంకోజు రాజు, మధు, యువ మోర్చా పట్టణ అధ్యక్షులు బబ్లు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఆకుల రాము, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక :-ఎస్పీ శ్రీనివాస రావు

వందేమాతరం' గేయం దేశభక్తి, ఐక్యత త్యాగానికి ప్రతీక అని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిన జాతీయ గేయం "వందేమాతరం" సామూహిక గీతాలాపన కార్యక్రమం శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ మైదానంలో లో ఘనంగా నిర్వహించారు. ఈ గేయానికి నేటితో 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరంలో 'వందేమాతరం' గేయం అనేకమందిలో పోరాట స్ఫూర్తిని నింపిందని అన్నారు. ఈ గేయం దేశభక్తి, ఐక్యత, త్యాగం వంటి విలువలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ ఎస్ మహేందర్, డీఎస్పీలు. ప్రసన్న కుమార్, సుభాష్ చంద్ర బోస్, రంగా నాయక్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, జర్జ్, శైలందర్, రామకృష్ణ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



సేంద్రీయ వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

- యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 7: సేంద్రీయ వ్యవసాయం ఆరోగ్యానికి మేలు చేస్తుందని యువ పారిశ్రామిక వేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలోని వంగ రాజేశ్వర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సిద్ధిపేటకు చెందిన ది మాస్టర్మైండ్స్ పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వంగ రాజేశ్వర్ రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. అనంతరం వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక వ్యవసాయం ఎక్కువగా రసాయనిక మందులపై ఆధార పడుతోందని అన్నారు. ఇది మనుషుల ఆరోగ్యానికి హానికరంగా మారిందన్నారు. నాలుగు సంవత్సరాలుగా తాను భవిష్యత్తు తరాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పూర్తిగా సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నామని తెలిపారు. అధికంగా పురుగు మందులు వాడటం వల్ల క్యాన్సర్ వంటి తీవ్రమైన రోగాలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సేంద్రీయ వ్యవసాయం అత్యంత అవసరమన్నారు. సాధ్యమైనంత వరకు విద్యార్థులు తమ తల్లిదండ్రులు సేంద్రీయ పద్ధతుల ద్వారా పంటలను పండించే విధంగా కృషి చేయాలని కోరారు. దీనివల్ల ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేయించిన జిల్లా టెలికాం బోర్డ్ సభ్యుడు



ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 7: ప్రతిరోజు వేలాది మోటారు వాహనాలు, భారీ లారీలు ప్రయాణిస్తున్న రోడ్డుపై పడ్డ గుంతలను పూడ్చేందుకు ఇటు మునిసిపల్, అటు ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లా టెలికాం బోర్డ్ సభ్యుడు కమ్మరి శ్రీనివాస్ శుక్రవారం నాడు రోడ్డుపై గల గుంతలను పూడ్చి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే గజ్వేల్, ప్రజ్ఞాపూర్ రోడ్డు మరమ్మతు గురించి పలుమార్లు మున్సిపల్, ఆర్ అండ్ బి మరియు కలెక్టరేట్ ప్రజావాణిలో వినతులు ఇచ్చిన జరిగే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని బీజేపీ నాయకులు చందాలు వేసి రోడ్డును మరమ్మత్తు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు చేప్యాల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఆలేటి సుమతి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్, గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్, పట్టణ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి ప్రసాద్ , చెన్నోజి నీరజ, మహిళా మోర్చా అధ్యక్షురాలు కుంకుమరాణి, బీజేపీ నాయకులు ఎల్లా బాబు, కొమ్ము అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



సంఘాల బలోపేతానికి మహిళలు కృషి చేయాలి

- సీనియర్ సీఆర్పీలు లలితా బాయ్, స్వరూప ఏపీఏ లక్ష్మీ నరసమ్మ
- మహిళా సంఘాలకు అవగాహన సదస్సు

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 7: మహిళా సంఘా బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీనియర్ సీఆర్పీలు లలితా బాయ్, స్వరూప ఏపీఏ లక్ష్మీ నరసమ్మ అన్నారు. శుక్రవారం మిడిదొడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘ అధ్యక్ష కార్యదర్శులతో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ సంఘంలో ఉన్న ఎస్ఎస్జీలు బలోపేతం చేయడానికి సంఘాలు ఎంతగానో దూతపడతాయన్నారు. గ్రామ సంఘాలు బలోపేతం అయితే మండల సమైక్య అభివృద్ధి దిశగా నడుస్తుందన్నారు. శిక్షణలో భాగంగా ప్రతి గ్రామ సంఘము అధ్యక్షురాలు విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి బాధ్యతలు ఎలా నిర్వర్తించాలి? గ్రామ సంఘాలకు ఆదాయ అభివృద్ధి ఎలా ఏర్పాటు చేసుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు ఈశ్వరమ్మ, జ్యోతి , బాలరాజు ,ప్రభాకర్, వైకుంఠం , మనమ్మ ,అకౌంటెంట్ శారద, ఆపరేటర్ భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.



ఇందిరానగర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి కళా ఉత్సవాల్లో మెరిసిన విద్యార్థినులు

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్ధిపేట, నవంబర్ 7: సిద్దిపేట జిల్లా సిద్దిపేటలోని ఇందిరా నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కళా ఉత్సవాల్లో ప్రతిభను చాటారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కళా ఉత్సవాల్లో తొమ్మిదవ తరగతి విద్యార్థిని బింగి శరణ్య సంప్రదాయ నృత్య విభాగంలో ఆకట్టుకుంది. పదవ తరగతి విద్యార్థిని ఖుషి సంప్రదాయ గాత్ర విభాగంలో తన ప్రతిభను కనబరిచింది. విద్యార్థినుల ఈ విజయంపై ప్రధానోపాధ్యాయుడు రాజ ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.



పాత పద్ధతితోనే పత్తి కొనుగోలు చేయాలి

- నియోజకవర్గ సీపీఐ పార్టీ కార్యదర్శి శివలింగ కృష్ణ

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 7: పాత పద్ధతి ద్వారానే పత్తి కొనుగోలు చేయాలని, సీసీఐ కేంద్రాలను పరిశీలించిన గజ్వేల్ నియోజకవర్గ సీపీఐ పార్టీ కార్యదర్శి శివలింగ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని పలు పత్తి మిల్లులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తేమ శాతం 8 నుంచి 12 వరకు కొనుగోలు చేస్తామని చెప్తున్నప్పటికి ఒక్కో పాయింట్ కు 81 రూపాయి చొప్పున తగ్గిస్తూ మద్దతు ధర కన్నా సుమారు 12 తేమ ఉన్న పత్తిని 7 వేల 800కే ఖరీదు చేస్తున్నారన్నారు. దీనివల్ల రైతు కనీస ప్రభుత్వ నిర్దేశిత ధర 8110 కూడా పొందడం లేదన్నారు. తేమ శాతము 8 నుంచి 12 వరకు మద్దతు ధరలో కోత పెట్టొద్దని తర్వాత 12 నుంచి కనీసం 18 తేమశాతం వరకైనా కొనుగోలు చేయాలని కోరారు. అలాగే చాలామంది కౌలు రైతులు భూమి కౌలుకు తీసుకొని పత్తి పండిస్తున్నారని కానీ వారు సీసీఐ కేంద్రంలో అమ్ముకునే సందర్భంలో తప్పనిసరిగా భూ పట్టేదారు రావాలని అలాగే అతని వేలిముద్ర ఉంటే తప్ప పత్తి తీసుకోమని సిసిఐ పెట్టిన నిబంధన ఎత్తివేయాలన్నారు. ఎకరానికి గతంలో నిర్ణయించిన 12 క్వింటాళ్ల బదులు ఏడు క్వింటాలకు తగ్గించడానికి తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసి గతంలో వలె 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయాలని కృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ పార్లమెంట్ సభ్యులు కేంద్ర జౌళి శాఖ మంత్రితో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నాయకులు కొండ కింది పోచయ్య, బొడ్ల సాయి వెంకటచారి, దాసరియాదయ్య, గూడరాజు, చింతకింది కనకయ్య, ఎండి సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



అత్యవసరాల్లో స్కౌట్స్, గైడ్స్ పాత్ర కీలకం

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 7: అత్యవసర పరిస్థితులలో స్కౌట్స్, గైడ్స్ పాత్ర చాలా కీలకమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. జాతీయ స్కౌట్స్, గైడ్స్ ఫౌండేషన్ డే సందర్భంగా శుక్రవారం మెదక్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు.ఈ ర్యాలీ కొత్త బస్టాండ్ నుండి రాందాస్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నాగేష్ మాట్లాడుతూ.. ఘన చరిత్ర కలిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వారసత్వాన్ని భావితరాలకు అందించాలన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కోర్సులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు.చిన్నప్పటి నుంచి విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యత పెంచడంతో పాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ముందుందన్నారు.ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు స్కౌట్స్ అండ్ గైడ్స్ అందించే సేవలు ఎంతో విలువైనవన్నారు.విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవా గుణం పెంపొందించే ఈ ఉద్యమంలో పిల్లలు చేరేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, ఎంజేపీ ఆర్సీఓ రాజేశం, డీఎస్ఓ రాజిరెడ్డి, ఎంజేపీ ప్రిన్సిపల్ సృజన, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

- మెదక్ విద్యుత్తు శాఖ ఏడీఈ మోహన్‌బాబు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 7: ప్రజలకు మరింత నాణ్యమైన, అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తదితర పనులు చేపట్టనున్న దృష్ట్యా జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంతో పాటు మెదక్, హవేలీ ఘనపూర్, చిన్నశంకరంపేట, పాపన్నపేట మండలాల్లో శనివారం, ఆదివారం 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మెదక్ విద్యుత్తు శాఖ ఏడీఈ మోహన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల్లోని సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్, ట్రీ కటింగ్‌తో పాటు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్, కరెంట్ తీగలను మార్చాల్సిన అవసరం ఉన్నందున ఈ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు తమకు సహకరించాలని ఏడీఈ మోహన్ బాబు కోరారు.

పటేల్ ఆశయాలను సాధించడం మన బాధ్యత

- సిద్దిపేటలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి వేడుకలు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 7: దేశ సమైక్యత కోసం పోరాడిన సర్దార్ పటేల్ ఆశయాలను సాధించడం మన అందరి బాధ్యత అని మేరా యువ భారత్ - మై భారత్' ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకట నర్సయ్యలు పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ సమైక్యతా స్ఫూర్తికి ప్రతీక అయిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 'మేరా యువ భారత్ - మై భారత్' ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకట నర్సయ్య, జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్లు డా. మహేష్ పర్షరాములు, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి 'సర్దార్ @150 యూనిటీ మార్చ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ఆయన 150వ జయంతిని అధికారికంగా నిర్వహించాలనే కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'ఏక్ భారత్ - ఆత్మనిర్భర్ భారత్' పేరిట ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల భాగంగా అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 వరకు సిద్దిపేట జిల్లాలో పలు ఏక్తా యాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. అక్టోబర్ 31న సర్దార్ పటేల్ విగ్రహాలకు నివాళులు అర్పించి, ముస్తాబాద్ చౌరస్తా నుండి విక్టరీ చౌరస్తా దాకా, అక్కడి నుండి కోమటి చెరువు ఓపెన్ ఆడిటోరియం వరకు ఏక్తా మార్చ్ నిర్వహించనున్నారు. అదేవిధంగా స్కూళ్లు, కాలేజీలు, విద్యాసంస్థల్లో సర్దార్ పటేల్ జీవిత విశేషాలపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నారు. యువతలో డ్రగ్స్ రహిత భారత్, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలపై ప్రతిజ్ఞలు చేయించి చైతన్యాన్ని నింపనున్నారు. ప్రతిభావంతులకు సర్టిఫికేట్లు కూడా అందజేయనున్నారు. యువత పటేల్ స్ఫూర్తిని ఆచరిస్తూ, దేశ సమైక్యత కోసం తమ వంతు కృషి చేయాలని, సిద్దిపేటలో జరగబోయే 'మేరా యువ భారత్ ఏక్తా ర్యాలీ'లో ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వలుస సుభాష్, అధికం రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లేసిన బీజేపీ నేతలు బిహార్ తొలి దశలోనూ ఓటు వేశారు. హరియాణాలో ఓట్ చోరీకి సంబంధించిన ఆధారాలను సమర్పించాం. హరియాణాలో 2 కోట్ల ఓటర్లలో 29 లక్షల మంది ఫేక్. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణాలో బీజేపీ ఓట్ చోరీకి పాల్పడింది. దాన్ని బిహార్‌లో రిపీట్ చేయాలని వారు చూస్తున్నారు. ఇక్కడి ప్రజలు అలా జరగనివ్వరు.

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

ప్రాంతీయం

ధాన్యం కొనుగోలులో అడుగడుగునా ఇబ్బందులే

- రైతులు అవస్థలు పడుతున్నా పట్టించుకోని చేతకాని రాష్ట్ర ప్రభుత్వం
- ఎంపీ అరవింద్



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణలో అడుగడుగునా లోపాలున్నాయని జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2014 లో కేవలం 10 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రం కొనుగోలు చేసేదని, ఇప్పుడు కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తోందని తెలిపారు. పంటల మార్పిడి పై ప్రభుత్వం వ్యవసాయ అధికారుల చేత అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ విధానాన్ని రూపొందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రం లో ఫీజు రియంబర్స్ మెంట్ ఆపేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీల గురించి మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. సీఎం రేవంత్ కేసీఆర్ కు గులాం గిరి చేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గరుస్తున్న అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఒక్కరినైనా అరెస్ట్ చేశారా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదన్నారు. జిల్లాలో మాధవ నగర్ ఆర్ఓబీ పెండింగ్ బిల్లుల విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశామని 10 రోజులలో రూ.14 కోట్లు విడుదల చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు దినేష్ కుల చారి, మాజీ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, పోతన్ కర్ లక్ష్మీనారాయణ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిషాసుర మర్దినిగా 'భూపేల్లి జ్యోతి'

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్(పెద్దపల్లి), నవంబర్ 7: కార్తీకమాసం సందర్భంగా పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ ఆది వరాహ స్వామి ఆలయంలో ఆలయ మాజీ డైరెక్టర్ భూపేల్లి జ్యోతి ప్రదర్శించిన మహిషాసుర మర్దిని నృత్య రూపకంతో పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఇప్పటికే భూపేల్లి జ్యోతి ఎన్నో నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నో అవార్డులు రికార్డులు అందుకున్నారు. కళ'కి వయస్సు తో పని లేదని, కళ పట్ల ఆసక్తి ఉంటే చాలని నిరూపించారు. చిన్నతనం లో నేర్చుకున్న కళని మర్చిపోకుండా ఎన్నో కార్యక్రమాలు చేస్తూ భూపేల్లి జ్యోతి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

'చిన్నారుల అరంగేట్రం'

కార్తీక మాసం సందర్భంగా స్వయం భూ శ్రీ ఆది వరాహ స్వామి ఆలయంలో నాట్య గురువులు టి. రవి కుమార్ మాస్టర్, ఆది వరాహ స్వామి ఆలయం మాజీ డైరెక్టర్. నృత్య కళాకారిని భూపెల్లి జ్యోతి ఆధ్వర్యంలో చిన్నారులు అరంగేట్రం ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 30 మంది చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని అలరించింది.



కలెక్టరేట్‌లో 'వందేమాతరం' గేయాలాపన

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 7: స్వాతంత్ర ఉద్యమంలో ప్రజల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి 150 యేండ్లు పూర్తయింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో శుక్రవారం ఉదయం సామూహికంగా వందేమాతరం గేయాలాపన చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వు మేరకు కరీంనగర్ కలెక్టరేట్లో వందేమాతరం గేయాన్ని ఉద్యోగులు ఆలపించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు వల్ల ప్రజలకు ఇబ్బందులు

- కమిషనర్ కు సీపీఎం వినతి
- మరోచోటకి తరలించాలని డిమాండ్

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 7: నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపల్ పరిధిలో ఒకటవ వార్డు, శివనేని గూడెం గ్రామ సమీపంలో గల చెత్త డంపింగ్ యార్డ్ వల్ల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 355 సర్వే నంబర్ లో గల ప్రభుత్వ భూమి లో చెత్తను మొత్తం డంపింగ్ చేయడం వల్ల దుర్వాసన వ్యాప్తి చెందుతుందని, దోమలు, పందులు, కుక్కలు స్వైర విహారం వల్ల వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ దండు శ్రీను ను కలిసి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డును ప్రజలకు ఇబ్బంది కలగకుండా మరోచోటకి తరలించాలని శంకరయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బొబ్బిలి సుధాకర్ రెడ్డి, నాయకులు ఐతరాజు యాదయ్య, పాలమాకుల అర్జున్, చొప్పరి లింగయ్య, మహాలింగారెడ్డి, పోతులూరి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



న్యాయ సేవాధికార సంస్థను వినియోగించుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 7: ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థను వినియోగించు కోవాలని, సమస్యలను శాంతి యుతంగా, త్వరితంగ పరిష్కరించు కోవాలని జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ అన్నారు. సిరిసిల్ల పట్టణం లోని ఓ ఫంక్షన్ హాల్ లో న్యాయ సేవల దినోత్సవం ను పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీగల్ సర్వీస్ అథారిటీస్ ఆక్ట్ 1987 అమల్లోకి వచ్చిన రోజు సందర్భంగా, పేద మరియు వెనుకబడిన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించడంలో న్యాయ సేవా సంస్థల పాత్రను వివరించారు. ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా కోర్టు సముదాయంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని లేదా హెల్ప్‌లైన్ నంబర్ 15100 ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో 'హకీ ఇండియా ' టోర్నమెంట్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 7: కరీంనగర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో హకీ మైదానంలో 100 ఇయర్స్ ఆఫ్ ఇండియన్ సందర్భంగా హకీ ఇండియా సెంటనరీ సెలబ్రేషన్ 2025 టోర్నమెంట్' ను కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ చేతుల మీదుగా ప్రారంభించారు. క్రీడాకారులకు కరీంనగర్ మాజీ మేయర్ రవిందర్ సింగ్, కరీంనగర్ జిల్లా హకీ అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ హకీ ప్రతినిధి కళ్యాణి మాట్లాడుతూ 100 ఏండ్ల హకీ సెలబ్రేషన్‌ను ఘనంగా జరుపుకుంటున్నామని అన్నారు. దేశ వ్యాప్తంగా హకీ ఇండియా గేమ్స్‌లో 36 వేల హకీ క్రీడాకారులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. హకీ ఇండియా ద్వారా 20 మంది క్రీడాకారులకు హకీ ఇండియాకు తయారు చేస్తున్నామన్నారు. కరీంనగర్‌ఓ టర్ఫ్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. రాబోయే రోజుల్లో కరీంనగర్ నుండి అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. తొలిరోజు క్రీడల్లో 6 హకీ టీములు పాల్గొంటున్నాయి.



రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన 'సాయి చైత్ర'

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 7: డిగ్రీ, పీజీలలో ఉత్తమ ర్యాంకులు సాధించడం ద్వారా సాయి చైత్ర రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో చదివిన కరీంనగర్ కు చెందిన కామినేని సాయి చైత్ర డిగ్రీలో బిబిఎం, పీజీ లో ఎంబీఏ లో శాతవాహన యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. కళాశాల యజమాన్యం గర్వపడేలా ర్యాంకులు సాధించి రెండు గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. కరీంనగర్ లోని శాతవాహన యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన రెండవ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సాయి చైత్ర రెండు గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా వివేకానంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సాగర్ విద్యార్థిని చైత్రను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా చెప్పారు. సహకరించిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీనీ

స్వచ్ఛంగా హరితంగా తీర్చిదిద్దుతాం

- మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 7: దమ్మాయిగూడ మున్సిపాలిటీని ఆదాశవంతంగా తీర్చి దిద్దుతామని మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి అన్నారు. ఆదిత్య నగర్ కాలనీలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ అంతటా చెత్త తొలగింపు, డ్రెయిన్‌ల శుభ్రపరిచే పనులు, రోడ్ల శుభ్రత తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కాలనీ పరిశుభ్రతపై మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని అన్నారు. ప్రజల సహకారంతో దమ్మాయిగూడ మరింత స్వచ్ఛంగా, హరితంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రామ్ రెడ్డి, ఆదిత్య నగర్ కాలనీ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



వందేమాతరం గేయానికి 150 ఏండ్లు

- ఆర్జీ1 జీఎం కార్యాలయం వందేమాతరం గేయం

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 7: వందేమాతరం గేయానికి 150 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ అదేశానుసారం శుక్రవారం జీఎం కార్యాలయంలో వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జీ 1 యస్ ఓ టు జీఎం చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వందేమాతరం గేయాన్ని రచించిన బంకిమ్‌చంద్ర చటర్జీ 1875, నవంబరు 7న 'వందేమాతరం' గేయం రాశాడని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతర గీతం ఎందరో ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చిందిని, సామాన్యులనూ సమరయోధులు గా మార్చిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యస్ ఓ టు జీఎం చంద్రశేఖర్, డీజీఎం క్వాలిటి నాగేశ్వరరావు, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డీజీఎం ఫైనాన్స్ ధన లక్ష్మి భాయి, ఏఐటీయూసీ జీఎం ఆఫీస్ఇంచార్జ్ రమేష్, డీవైపీఎం వేణు అధికారులు భీమా, మోహన్ రావు, వీరారెడ్డి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



“

గ్రామీణ రోడ్ల స్థితిగతులు ప్రజలకు ముందుగా తెలిసేలా 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం'ను తీసుకురానున్నాం. ₹2,123 కోట్ల సాస్కీ నిధులతో పల్లెపండగ 2.0లో 4007 కిలోమీటర్ల రహదారులు, గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లు నిర్మిస్తాం. నిర్మాణాలు నాణ్యతతో ఉండాలి. స్వమిత్వ పథకం ద్వారా గ్రామాల్లో మార్చికి కోటి మంది ఆస్తులకు యాజమాన్య హక్కు (ప్రాపర్టీ) కార్డులు అందిస్తాం.

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

సిద్ధమవుతున్న ఇందిరా మహిళా శక్తి చీరలు

- ఉత్పత్తిని పరిశీలించిన జిల్లా సమాఖ్యల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు



ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 7 : ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తిని 32 జిల్లా సమాఖ్యల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పరిశీలించారు. జిల్లా కేంద్రంలో వెంకట్రావునగర్ లోని మరమగ్గాల యూనిట్, గీతానగర్ లోని ప్రాసెసింగ్ యూనిట్, వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంను పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి మరమగ్గాల పై సిద్ధం అవుతున్న చీరలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆయా జిల్లాల మహిళా సంఘాల బాధ్యులు నేరుగా పరిశీలించారు. దారం నుంచి చీరల తయారయ్యే విధానాన్ని చూసి, దాని వివరాలను కార్మికులు, యజమానులను అడిగి తెలుసుకున్నారు. తాము వివిధ రకాల చీరలు కొనుగోలు చేసి వినియోగిస్తామని, మొదటి సారి వాటి తయారీ ప్రక్రియ, ఇతర దశలు, ప్యాకింగ్, గోడౌన్ ను నేరుగా చూసే అవకాశం వచ్చిందని తెలిపారు. కార్మికుల నైపుణ్యం, తయారీ విధానంపై అవగాహన వచ్చిందని పేర్కొన్నారు. ఎంతో నాణ్యతతో ఇందిరా మహిళా శక్తి చీరలు సిద్ధమవుతున్నాయని వివరించారు. అనంతరం 32 జిల్లా సమాఖ్యల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగర్వాల్ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎస్ హెచ్ జి సభ్యులకు ఇందిరా మహిళా శక్తి చీరలు 64 లక్షలు సిద్ధమవుతున్నాయని ఇందిరా మహిళా శక్తి కింద మహిళలకు చీరలు అందజేయడం తో పాటు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమంలోని వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని వెల్లడించారు. వస్త్ర పరిశ్రమకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. కార్మికులు ఎంతో నైపుణ్యంతో చీరలు నేస్తారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళా శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు డైరీ యూనిట్ కోడి పిల్లల పెంపకం ఆర్టీసీ బస్సులు పెట్రోల్ బంక్ ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేశామని తెలిపారు.

డిపెండెంట్లకు 16న ఉద్యోగ నియామక పత్రాలు

- నవంబర్ చివరిలో మెడికల్ బోర్డు
- నిర్వహించేందుకు యాజమాన్యం అంగీకారం
- సీఎండి నీ కలిసిన గుర్తింపు సంఘం అధ్యక్ష కార్యదర్శులు



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 7: సింగరేణి లో మెడికల్ ఫిట్ ఐన కార్మికుల డిపెండెంట్లకు పెండింగ్ లో ఉన్న ఉద్యోగ నియామక ఉత్తర్వులు నవంబర్ 16 న కొత్తగూడెం లో యాజమాన్యం జారీ చేసేందుకు అంగీకరించిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. శుక్రవారం వారు హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో సి అండ్ ఎండిని, డైరెక్టర్ ఫాలను కలిసి కార్మికుల సమస్యల పై చర్చించగా పరిష్కరించేందుకుయాజమాన్యం అంగీకరించిందని వారు తెలిపారు. ముఖ్యంగా గత ఏడు నెలలుగా నిలిచి పోయిన మెడికల్ బోర్డును ఈ నెలాఖరిలోపు పెట్టుటకు ఒప్పుకున్నారని వారు తెలిపారు. అదేవిధంగా మెడికల్ ఇన్వాలిడేషన్ ఐన ఉద్యోగుల వారసులు మెడికల్ ఫిట్ అయి పోస్టింగ్ కొరకు ఎదురుచూస్తున్న దాదాపు 473 మంది నవ యువకులకు ఈనెల 16 న కొత్తగూడెంలో పోస్టింగ్ ఆర్డర్స్ అందచేస్తారని తెలిపారు. సింగరేణి లో ప్రణాళిక ప్రకారం జరిగే చైర్మన్ అండ్ మేనేజింగ్, డైరెక్టర్ ఫా స్థాయి స్ట్రక్చరల్ కమిటీ సమావేశం ఈనెల 10 న, జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం 11న జరుపుటకు ఒప్పుకొన్నారని పేర్కొన్నారు. కార్మికుల పెండింగ్ సమస్యలను స్ట్రక్చరల్ కమిటీ సమావేశంలో చర్చించి పరిష్కరించడం జరుగుతుందని వారు తెలిపారు. ఇంకా అధికారులను కలిసిన వారిలో ముస్కే సమ్మయ్య తదితరులు ఉన్నారు.

ప్రాంతీయం



కలెక్టరేట్ లో 'వందేమాతరం' సామూహిక గేయాలాపన

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 7: 'వందే మాతరం'జాతీయ గేయాన్ని మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అందరూ స్వచ్ఛందంగా పాల్గొని దేశభక్తి భావాన్ని చాటారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. సామూహిక గేయాలాపనలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- 11th జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 2025-26 లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం, సోన్, నవంబర్ 7 : సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో నిర్వహించిన 11th జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 202526 లో రాష్ట్రబీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం హ్యాండ్ బాల్ ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రశాంతి, మండల సీనియర్ నాయకులు సరికెల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్, జమాల్, ఉదయ్,సాయిలు, నాగరాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఆడెల్లి శ్రీ మహా పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 7: ఆడెల్లి శ్రీ మహా పోచమ్మ అమ్మవారిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, శుక్రవారం దర్శించుకున్నారు. ఆడెల్లి నూతన దేవాలయ ప్రారంభోత్సవం, పోచమ్మ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్టాపన వేడుకల సందర్భంగా కలెక్టర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ కు ఆలయ పండితులు, అధికారులు స్వాగతం పలికారు. నూతన ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారి ఆశీర్వచనాలు, మంగళహారతులు, తీర్థప్రసాదాలు కలెక్టర్ కు అందజేశారు. శాలువాతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సర్వాంగ సుందరంగా నూతన ఆలయం ప్రారంభించుకొని, అమ్మవారి కొత్త విగ్రహాన్ని ప్రతిష్టించుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరారు. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించాలని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ భోజా గౌడ్, ఈవో భూమయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ లో వందేమాతరం గీతాలాపన

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 7: బంకించంద్ర ఛటర్జీ రాసిన దేశభక్తి గీతం వందేమాతరం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం వందేమాతరం గీతాలాపన చేశారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ , జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని దేశభక్తి గీతం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. దేశ స్వాతంత్రోద్యమంలో దేశవాసులందరికీ స్ఫూర్తిని నింపిన బంకిం చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గీతం శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తిచేసుకుంది. కేంద్ర ప్రభుత్వం వందేమాతరం 150ఏళ్ల ఉత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించడంతోహనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొని వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి మహమ్మద్ గౌస్ హైదర్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వందేమాతరానికి 150 ఏళ్లు

- ప్రభుత్వ కార్యాలయాల్లో దేశభక్తి గానం

ప్రతిపక్షం గుండాల, నవంబర్ 7: జాతీయ గేయం వందేమాతరానికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గేయం ఘనంగా ఆలకించారు. దేశభక్తి జ్యోతిని ప్రజల్లోకి తీసుకెళ్ళే ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది వందేమాతరం గేయాన్ని సమూహంగా పాడి దేశానికి తమ నిబద్ధతను వ్యక్తం చేశారు.తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, వ్యవసాయ, విద్య, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, పోలీస్ శాఖ తదితర శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- ధాన్యం బస్తాల అన్ లోడింగ్ లో జాప్యంపై ఆగ్రహం



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 7: జిల్లా కేంద్రానికి సమీపంలో ఖానాపూర్ శివారులో కొనసాగుతున్న ఆర్.కె రైస్ మిల్ ను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల లోడ్ల ధాన్యం పంపించారు, వాటిని ఎప్పుడు దిగుమతి చేసుకున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలన జరిపారు. అంతకుముందు కలెక్టర్ డిచ్పల్లి మండలం రాంపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఇప్పటివరకు ఎంతమంది రైతుల నుండి ధాన్యం సేకరించారు, రైస్ మిల్లులకు ఎన్ని లారీల లోడ్ల ధాన్యం వెళ్ళింది అని కేంద్రం నిర్వాహకులను ప్రశ్నించారు. అయితే, దొడ్డు రకం ధాన్యాన్ని రైస్ మిల్లుల వద్ద రోజుల తరబడి దించుకోవడం లేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని కేంద్రం నిర్వాహకులతో పాటు స్థానిక రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ కు ఫోన్ చేసి, కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలను పంపాలని, లేని పక్షంలో కాంట్రాక్ట్ రద్దు చేస్తామని అన్నారు. అక్కడి నుండి కలెక్టర్ నేరుగా ఖానాపూర్ లోని ఆర్ కె రైస్ మిల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రక్ షీట్లను తెప్పించుకుని ధాన్యం అన్ లోడింగ్ సకాలంలో చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పలు లారీలు రైస్ మిల్ ఆవరణలో ధాన్యం బస్తాల లోడ్లతో నిలిచి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, ఎన్ని రోజుల నుండి ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదని లారీ డ్రైవర్ లను ప్రశ్నించారు. ఐదారు రోజులుగా దించుకోవడం లేదని వారు తెలుపగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకుని, వెంటవెంటనే ట్రక్ షీట్ లు అందించాలని పదేపదే సూచిస్తున్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైస్ మిల్ నిర్వాహకులను నిలదీశారు. రోజుల తరబడి ధాన్యం దిగుమతి చేసుకోకుండా మిల్లుల వద్దే వాహనాలను నిలిపి ఉంచితే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ లకు సంబంధించి సమగ్ర పరిశీలన చేసి, తనకు పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ తన వెంట ఉన్న డీ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డిలకు సూచించారు.

రాంపూర్ లో జ్యోతిబాపూలే పాఠశాల తనిఖీ

డిచ్పల్లి మండలం రాంపూర్ గ్రామంలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, కోడి గుడ్లు, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేసేలా చూడాలన్నారు. భోజనం వండడానికి ముందే ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, కాలం చెల్లిన పదార్థాలు వినియోగించకూడదని సూచించారు. నాసిరకమైన బియ్యం, నూనె, ఇతర సరుకులు సరఫరా జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని, వాటి స్థానంలో నాణ్యమైన సరుకులను సమకూర్చేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ సతీష్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్, స్థానిక అధికారులు ఉన్నారు.



ప్రమాదాల నివారణకై ప్రత్యేక చర్యలు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట, నవంబర్ 7 : నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకై మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోకి వెళ్లే ప్రధాన రహదారి పై గల చిరు వ్యాపారులకు, దుకాణదారులకు ప్రత్యేక సూచనలు చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాల ముందు బైకులు పార్క్ చేయవద్దని, చిరు వ్యాపారాలు రోడ్డుపై అడ్డంగా వ్యాపారాలు పెట్టుకోరాదని సూచించారు. సందర్భంగా ఇద్దరు ప్రత్యేక ట్రాఫిక్ కానిస్టేబుల్ లను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారి మారిన బోర్డు మారదు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్,నవంబర్ 7 : తెలంగాణ రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం ఉద్దేశం నీరు గారి పోతుంది. నారాయణపేట జిల్లా మక్తల్ విద్యాధికారి రిటైర్ అయి వారం కావస్తున్న సమాచార హక్కు చట్టం బోర్డుపై అధికారి పేరు ఇప్పటికి కూడా తీసివేయలేదు. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు మారిన సమాచారకు చట్టం బోర్డుపై వివరాలు చాలావరకు పాతవే ఉంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు వివరాలు మార్చాలని పలువురు దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు



ప్రతిపక్షం, కొల్లాపూర్, నవంబర్ 7: వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్ ఐ డి ప్రభుత్వ హై స్కూల్, కొల్లాపూర్ లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. "స్వరాజ్యం - స్వదేశీ - సమైక్యత" అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉదయం 10 గంటలకు ఏకకాలంలో వందేమాతరం ఆలపించాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు, పాఠశాలలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు సమూహ గానం గా వందేమాతరం పూర్తి గేయాన్ని గీతాలాపన చేసి దేశభక్తిని ప్రతిబింబించారు. మండల ఎంఈఓ మరియు పాఠశాల హెడ్మాస్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ "వందేమాతరం గేయం స్వాతంత్ర్య పోరాట సమయంలో దేశాన్ని ఒక తాటిపైకి తెచ్చిన శక్తి. భావి తరాలు ఈ గేయం గొప్పతనాన్ని తెలుసుకోవాలి" అని పేర్కొన్నారు. "కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ దేశాన్ని ఏకం చేసిన ఈ గేయం మనకు గర్వకారణం. ఈ రోజు విద్యార్థులు గానం చేసిన వందేమాతరం వారి దేశభక్తిని ప్రతిఫలించింది" అని అన్నారు. విద్యార్థులు దేశభక్తి నినాదాలతో పాఠశాల ప్రాంగణాన్ని మారు మోగించారు. ఉపాధ్యాయులు కూడా కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ గౌరవాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం చివరగా అందరూ కలిసి "జైహింద్" నినాదంతో వేడుకలను ముగించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి

ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 7: సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గుండాల మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి, బాటన్న, ఎస్కే అస్గర్ స్తూపాల వద్ద జెండా ఆవిష్కరణ చేసి ఘన నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన ర్యాలీ, సభలో జిల్లా నాయకులు ముక్తి సత్యం, కొమరం సీతారాములు, మండల కార్యదర్శి అరెం నరేష్ మాట్లాడుతూ భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం 1969లో సిపిఐ(ఎంఎల్) ఆవిర్భవించిందని గుర్తు చేశారు. గోదావరి లోయ పరివాహక ప్రాంతాల్లో దున్నేవానికి భూమి కావాలని పోరాడుతూ కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి, పొట్ల రామ నరసయ్య, నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, గడ్డం వెంకట్రామయ్య (దొరన్న) వంటి యోధులు నవంబర్ నెలలో అమరులయ్యారని తెలిపారు.ఇల్లందు ఏజెన్సీ ప్రాంతంలో కామ్రేడ్ ఎల్లన్న, లింగన్న, బాటన్న, ముక్తార్ పాషన్న, కాచినపల్లి అమరులు, కొండన్న తదితరులు పేద ప్రజల కోసం పోరాడుతూ ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19న హైదరాబాదులో జరిగే కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండల నాయకులు పర్శక రవి, యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, ఈసం కృష్ణన్న, పెండకట్ల పెంటన్న, మానాల ఉపేందర్, పాయం ఎల్లన్న, భూక్యా వెంకన్న, గొగ్గల శ్రీను, తాటి రమేష్, కల్తి ప్రమోద్, దుగ్గి శేఖర్, వాగబోయిన బుచ్చయ్య, ఎట్టి సుధాకర్, ఈసం లక్ష్మీనారాయణ, అరేం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 7: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి మరింత వేగవంతంగా సాగే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ, డిఆర్డిఓ, మెప్మా, ఎంపీడీవోలతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మండలాలు, మున్సిపల్ పరిధిలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, ఇంకా ఇండ్ల నిర్మాణం మొదలు పెట్టని లబ్ధిదారుల సంఖ్య, తదితర అంశాలను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వారం రోజుల్లోగా ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 295 స్లాబ్ లెవెల్ వచ్చిన ఇండ్లు పది రోజుల్లో లబ్ధిదారులు పూర్తి చేసుకునే విధంగా అధికారులు కృషిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఎంజిఎన్ఆర్ఇజిఎస్, ఎస్ బి ఎం కింద ఇందిరమ్మ లబ్ధిదారులను ఆ పథకాలకు అనుసంధానం చేయాలన్నారు. ఇంకా లబ్ధిదారులు ఎవరైనా మిగిలి ఉన్నట్లయితే వారిని త్వరగా గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాలకు సంబంధించి తక్కువ ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో లబ్ధిదారులకు రూ.లక్ష లోపు రుణాలను అందించి త్వరగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా అధికారులు తోడ్పాటును అందించాలన్నారు. 2బీహెచ్ కె ఇండ్ల కు లబ్ధిదారుల ఎంపికను వారం రోజుల్లో గుర్తించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పైలట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని అధికారులు ప్రతి రోజు పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసునేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మేన శ్రీను, గృహ నిర్మాణ శాఖ పీడీ హరికృష్ణ, మెప్మా పీడీ జోనా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డివిజన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ, హౌసింగ్ డిఈలు రవీందర్, సిద్దార్థ నాయక్, ఎంపీడీవోలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.




బంగ్లాదేశ్‌లోని యూనస్ ప్రభుత్వంలో తీవ్రవాదులకు మద్దతునివ్వడం వల్ల ఇండియాతో సంబంధాలు దెబ్బతింటాయి. అవామీ లీగ్‌పై నిషేధంతో తన మద్దతుదారులు రానున్న ఎలక్షన్లో పాల్గొనే అవకాశం లేదు. మైనారిటీలు దాడులకు గురవుతున్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై కోర్టుకు ఆధారాలు సమర్పిస్తా. భారత్ తనకు స్వర్గధామంలాంటి ఆశ్రయాన్ని కల్పించింది.

- బంగ్లాదేశ్‌మాజీ ప్రధాని షేక్ హసీనా

విశ్వ వీక్షణం

'వందేమాతరం' ఒక స్వప్నం, ఒక సంకల్పం

- **గీతాలాపనలో కొనియాడిన ప్రధాని నరేంద్ర మోడీ**



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 7: వందేమాతర గీతం ఒక స్వప్నం, ఒక సంకల్పం. ఒక మంత్రం, దేశమాత ఆరాధన, సాధన అని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. వందేమాతరం. మనల్ని పురాణ ఇతి హాసాలలోకి తీసుకెళ్తుందని, భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుందని చెప్పారు. వందేమాతరం సామూహిక గీతాలాపన అద్భుత అనుభవమని, ఒకే లయ, స్వరం, భావంతో గీతాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుందని తెలిపారు. 'వందేమాతరం' గీతానికి 150 యేండ్లు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో ఇందిరాగాంధీ స్టేడియంలో వందేమాతరం స్మారకోత్సవ కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సామూహిక గీతాలాపనలో కార్యక్రమంలో ప్రధాని, కేంద్రమంత్రి షెకావత్, ఢిల్లీ సీఎం రేఖాగుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ ప్రసంగించారు. యేడాది పొడువునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. వందేమాతరం స్మారకోత్సవాలు దేశ ప్రజలకు ప్రేరణ ఇస్తాయని, స్మారక స్టాంపు, నాణెం విడుదల చేశామన్నారు. ప్రతి గీతానికి ఒక మూల భావం, సందేశం ఉంటుందని, వందేమాతరం మూల భావం, సంకల్పం భారత్ అని ప్రధాని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి నిలదొక్కుకునే ప్రేరణగా నిలిచిందని, పూర్వీకులు భారత్ ను ఓ సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. భారత్ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని అమరత్వం పొందిందని, బంకించంద్ర 'ఆనంద మఠ్' ఉపన్యాసం మాత్రమే కాదని ఠాగూర్ చెప్పారని గుర్తు చేశారు.



పరిశోధనల కోసం లక్ష కోట్లు


- **కేటాయిస్తున్నట్టు ప్రకటించిన ప్రధాని మోడీ**

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 7: భారత దేశంలో అతిపెద్ద లోపం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్. 75 యేండ్లు దేశాన్ని పాలించిన పాలకులు దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. పరిశోధనలో 90 శాతం విఫలం అవుతాయి. దీంతో పెట్టుబడి వృథా అన్న భావనతో డబ్బులు ఖర్చు చేయలేదు. కానీ, అమెరికా, యూరప్ వంటి దేశాలు పరిశోధలన మీద ఎక్కువ దృష్టి పెట్టాయి. దీంతో ఇప్పుడు లక్షల కోట్లు సంపాదిస్తున్నాయి. మన దేశంలో పరిశోధనలకు అవకాశం లేకపోవడంతో భారత ప్రతిభ విదేశాలకు వెళ్తోంది. అమెరికా, చైనా లాంటి దేశాలు ప్రభుత్వ సహకారంతో పరిశోధనలను లాభదాయక వ్యాపారాలుగా మార్చుకున్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, టెస్లా వంటి విజయవంతమైన సంస్థలు అన్నీ పరిశోధనల ప్రాజెక్టుల నుంచే పుట్టాయి. దేశంలో పరిశోధన వాతావరణాన్ని సమూలంగా మార్చేందుకు ప్రధాని మోడీ లక్ష కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు చెప్పారు. ఈ నిధులు ప్రైవేటు, ప్రభుత్వ, విద్యాసంస్థల మధ్య సాంకేతిక భాగస్వామ్యానికి మద్దతు ఇస్తాయి. దీని ద్వారా స్వదేశీ ఇన్నోవేషన్‌కి ఆర్థిక రక్షణ లభిస్తుంది. అత్యాధునిక పరిశోధనలకు అవరోధాలు తగ్గితే దేశీయ ప్రతిభ తిరిగి భారత్‌లోనే అవకాశాలు కల్పించుకుంటుంది. ఈ నిర్ణయం శాస్త్రవేత్తల వలస సమస్యను తగ్గించేందుకు ముందడుగని భావించవచ్చు. అందులో భాగంగా విద్యా సంస్థల్లో పరిశోధనా హబ్‌లు, ప్రైవేటు కంపెనీలకు పన్ను రాయితీలు లాంటి చర్యలు ప్రోత్సాహకంగా ఉంటాయి. పరిశోధనల్లో పెట్టుబడులు పెట్టడం తక్షణ ఫలితాలను ఇవ్వదు. పది ప్రాజెక్టుల్లో ఒకటి లేదా రెండు మాత్రమే విజయవంతం అవుతాయి.



After Retirement ఓ టూరేస్కోండి!!

రిటైర్‌మెంట్ అంటే మనం పని భారం నుండి విముక్తి పొంది, మనకోసం కొంత సమయాన్ని వెచ్చించినప్పుడే జీవితం ఆనందకరంగా ఉంటుంది. ట్రావెలింగ్ అనేది ఈ సమయాన్ని గుర్తుండిపోయేలా చేయడానికి ఒక గొప్ప ఆప్షన్. కానీ కొన్నిసార్లు బడ్జెట్ లేకపోవడం వల్ల చాలా మంది ట్రిప్‌లు ప్లాన్ చేసుకోలేకపోతుంటారు. అటువంటి పరిస్థితిలో మన దేశంలో 10 సరసమైన రిటైర్మెంట్ గమ్యస్థానాల గురించి తెలుసుకుందాం. తక్కువ ఖర్చుతో కూడా సరదాగా గడపగలిగే అనేక ప్రదేశాలు భారతదేశంలో ఉన్నాయి? భారతదేశంలో అనేక అందమైన నగరాలు, పట్టణాలు సహజ సౌందర్యంతో నిండి ఉన్నాయి. ఈ ప్రదేశాలు బడ్జెట్‌కు అనుకూలమైనవి కూడా. విశేషమేమిటంటే, పదవీ విరమణ తర్వాత ఎక్కడికైనా వెళ్లాలనుకునే వారికి ఈ ప్రదేశాలు సరైనవి.



కేరళ

కేరళలోని పచ్చటి వాతావరణం, బ్యాక్ వాటర్స్, ఆయుర్వేద చికిత్స మరియు రుచికరమైన సముద్రపు ఆహారం మీ రిటైర్మెంట్ జీవితానికి కొత్త అనుభవాన్నిస్తాయి. ఇక్కడ మీరు హౌస్‌బోట్‌లో టూర్ చేయవచ్చు, యోగా మరియు ధ్యానం చేయవచ్చు. స్థానిక సంస్కృతిని ఆస్వాదించవచ్చు. మీరు హాయిగా ఉండేందుకు కేరళలో అనేక బడ్జెట్ అనుకూలమైన రిసార్ట్‌లు ఉన్నాయి.

గోవా

భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం గోవా. ఇక్కడ మీరు అందమైన బీచ్‌లు, వాటర్ గేమ్‌లు, లైవ్ మ్యూజిక్‌తో పాటు రుచికరమైన ఆహారాన్ని ఆస్వాదించవచ్చు. గోవాలో మీరు బడ్జెట్ హోటల్స్ లేదా గెస్ట్ హౌస్‌లలో బస చేయవచ్చు, స్థానికంగా రవాణా కూడా తక్కువ ఖర్చుతోనే ఉంటుంది.

హిమాచల్ ప్రదేశ్

హిమాచల్ ప్రదేశ్‌లోని పచ్చని లోయలు, నిర్మలమైన దేవాలయాలు, మంచుతో కప్పబడిన పర్వతాలు మిమ్మల్ని ప్రకృతికి దగ్గర చేస్తాయి. ఇక్కడ మీరు ట్రెక్కింగ్, పారాగ్లైడింగ్, స్కీయింగ్ వంటి సాహస కార్యకలాపాలను ఆస్వాదించవచ్చు. హిమాచల్ ప్రదేశ్‌లో చాలా చిన్న పట్టణాలు, గ్రామాలు ఉన్నాయి.

కాశ్మీర్

కాశ్మీర్ అందాలను చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇక్కడ ఉన్న సరస్సులు, తోటలు మరియు హౌస్‌బోట్‌లు మీకు అద్భుతమైన అనుభూతిని అందిస్తాయి. కాశ్మీర్‌లో మీరు షికారా పర్యటనలో పాల్గొనవచ్చు. స్థానిక మార్కెట్‌లను సందర్శించవచ్చు మరియు కాశ్మీరీ వంటకాలను రుచి చూడవచ్చు.

రాజస్థాన్

రాజస్థాన్ చరిత్ర, సంస్కృతి మరియు వాస్తుశిల్పాలు మిమ్మల్ని మంత్రముగ్ధులను చేస్తాయి. ఇక్కడ ఉన్న కోటలు, రాజభవనాలు, దేవాలయాలు మరియు భవనాలు మీకు తప్పకుండా రాచరికపు జీవితాన్ని ఆస్వాదించేలా చేస్తాయి. రాజస్థాన్‌లో జైపూర్, ఉదయపూర్, జోధ్‌పూర్ మరియు జైసల్మేర్ వంటి నగరాలను అతి తక్కువ ఖర్చుతో సందర్శించవచ్చు.

ఉత్తరాఖండ్

ఉత్తరాఖండ్‌ని దేవభూమి అంటారు. ఇక్కడ ఉన్న పవిత్ర నదులు, పురాతన దేవాలయాలు మరియు యోగా కేంద్రాలు మీకు ఆధ్యాత్మిక శాంతిని అందిస్తాయి. ఉత్తరాఖండ్‌లో మీరు రిషికేశ్, హరిద్వార్, బద్రీనాథ్ మరియు కేదార్‌నాథ్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు.

మేఘాలయ

మేఘాలయలోని అందమైన లోయలు, శక్తివంతమైన సంస్కృతి మరియు రుచికరమైన ఆహారం మీకు ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తాయి. ఇక్కడ మీరు లివింగ్ రూట్ బ్రిడ్జ్, గుహలు మరియు జలపాతాలను చూడవచ్చు. మేఘాలయలో మీరు షిల్లాంగ్ మరియు చిరపుంజీ వంటి నగరాలను సందర్శించవచ్చు.

ఒడిశా


ఒడిశా చాలా గొప్ప చరిత్ర, సంస్కృతిని కలిగి ఉంది. ఇక్కడి దేవాలయాలు, బీచ్‌లు మరియు ప్రకృతి అందాలు మిమ్మల్ని మంత్రముగ్ధులను చేస్తాయి. ఒడిశాలో మీరు కోణార్క్ టెంపుల్, పూరి, భువనేశ్వర్ వంటి నగరాలను సందర్శించవచ్చు.


తమిళనాడు


తమిళనాడు సంస్కృతి, కళ మరియు వాస్తుశిల్పం మిమ్మల్ని మంత్రముగ్ధులను చేస్తాయి. ఇక్కడి దేవాలయాలు, బీచ్‌లు మరియు హిల్ స్టేషన్‌లు మీకు అద్భుతమైన అనుభూతిని అందిస్తాయి. తమిళనాడులో మీరు మధురై, చెన్నై, కుంభకోణం మరియు ఊటీ వంటి నగరాలను సందర్శించవచ్చు.

ఉత్తరప్రదేశ్


ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి పవిత్ర నగరం. ఇక్కడ గంగా ఆరతి, ఆలయ దర్శనం మరియు ఘాట్‌లలో గడిపిన సమయం మీకు ఆధ్యాత్మిక ప్రశాంతతను ఇస్తుంది. ఇక్కడ అనేక రుచికరమైన ఆహారాలను ఆస్వాదిస్తారు.





















సమగ్ర ఓటరు జాబితా సవరణ సజావుగా సాగేనా!

- **తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విపక్షాలు**

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 7: భారత ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓటర్ల జాబితాలను డిజిటల్ యుగానికి అనుగుణంగా మార్చే ప్రయత్నం. బిహార్‌లో చేపట్టిన ప్రక్రియ విజయవంతమైంది. లక్షల మంది ఫేక్ ఓటర్లు తొలగిపోయారు. దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఈసీఐ భావిస్తోంది. అయితే, ఇది రాజకీయ వివాదాలకు కారణమవుతోంది. దేశవ్యాప్తంగా ఫేక్ ఓటర్లను గుర్తించి తొలగించాలనే ఈ కార్యక్రమం డెమొక్రటిక్ ప్రాసెస్‌ను బలోపేతం చేస్తుందని ఈసీఐ చెబుతుంటే, వ్యతిరేకవాదులు ఇది ఓటర్ల హక్కులను దెబ్బతీస్తుందని ఆరోపిస్తున్నారు. ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలను విస్తృతంగా సమీక్షించి, అక్రమ ఎంట్రీలను తొలగించే ప్రక్రియ. దీని ద్వారా జన్మస్థలం, ఆధార్ వంటి డాక్యుమెంట్లను ధ్రువీకరించి, డూప్లికేట్లు, అన్‌వెరిఫైడ్ రికార్డులను పరిశీలిస్తారు. 2025లో రెండోదశలో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో మొదలైంది. 321 జిల్లాలలో 1,850 అసెంబ్లీ సెగ్మెంట్లలో 10 లక్షల మంది అధికారులు పాల్గొంటారు. డిసెంబర్ నాలుగు నాటికి పూర్తి అవుతుందని ఈసీఐ ప్రకటించింది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను పెంచడానికి డిజిటల్ టూల్స్‌ను ఉపయోగిస్తుంది, కానీ దీని అమలులో రాజకీయ పక్షాల నుంచి వ్యతిరేకత వస్తోంది. బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఎందుకంటే 30 లక్షల మంది చట్టబద్ధ ఓటర్లు తొలగించబడ్డారని కాంగ్రెస్ వంటి పార్టీలు ఆరోపిస్తున్నాయి.

వచ్చే యేడాది ఇండియాకు ట్రంప్!

- **మోడీ తనకు మంచి స్నేహితుడన్న అమెరికా ప్రెసిడెంట్**

న్యూయార్క్ (అమెరికా), నవంబర్ 7: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మీద అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. మోడీ చాలా గొప్ప వ్యక్తి అని, తనకు మంచి స్నేహితుడని చెప్పారు. వచ్చే యేడాది భారత్ పర్యటకు వెళతానని అన్నారు. భారత్‌తో వాణిజ్య చర్చలు అద్భుతంగా సాగుతున్నాయన్న ట్రంప్, ఇరు దేశాల చర్చలు త్వరలోనే కొలిక్కి వస్తాయన్నారు. మోడీ మంచి స్నేహితుడిగా అభివర్ణించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసే ప్రయత్నాలలో భాగంగా వచ్చే యేడాది భారతదేశాన్ని సందర్శించవచ్చని కూడా సూచించారు. ఆయన వైట్ హౌస్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాని మోడీతో చర్చలు చాలా బాగా జరుగుతున్నాయన్నారు. భారతదేశం రష్యా నుండి కొనుగోలు చేయడం దాదాపుగా ఆపివేసిందని తెలిపారు. ఇదిలావుంటే, భారీ సుంకాలు విధించాలనే వాషింగ్టన్ నిర్ణయం తర్వాత, ఈ యేడాది చివర జరగనున్న క్వాడ్ సమ్మిట్ కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇక మీదట భారతదేశాన్ని సందర్శించే ఉద్దేశం లేదని గతంలో మీడియాలో కథనాలు వచ్చాయి. ట్రంప్ గతంలో తాను శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతానని మోడీకి హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పుడు ఆయన తన ప్రణాళికలను మార్చుకున్నారని వెల్లడించింది. కాగా, భారతదేశం రష్యా చమురు కొనుగోళ్లపై అదనంగా 25 శాతం సహా 50 శాతం సుంకాలను విధించాలని వాషింగ్టన్ నిర్ణయం తీసుకున్న తరువాత, భారతదేశం, అమెరికా మధ్య కొనసాగుతున్న వాణిజ్య చర్చల మధ్య ఈ వ్యాఖ్యలు వచ్చాయి.



ట్రంప్ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నాం

- **భారత విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్**

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 7: ప్రపంచంలో అణ్వాయుధాలను తరచుగా పరీక్షిస్తున్న దేశాలలో పాకిస్తాన్ కూడా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. రహస్యంగా, చట్టవిరుద్ధంగా అణు కార్యకలాపాలు కొనసాగించడంలో పాక్‌కు దశాబ్దాల చరిత్ర ఉందని విమర్శించింది. స్మగ్లింగ్, ఎగుమతి నియంత్రణ ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు దశాబ్దాలుగా పాకిస్తాన్‌కు అలవాటేనని పేర్కొంది. ఆ ఏక్యూ ఖాన్ నెట్‌వర్క్ విస్తరణ చుట్టూ కేంద్రీకృతమై ఉందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ఈ అంశాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తాము ఎప్పటికప్పుడు తీసుకెళుతూనే ఉంటామన్నారు. పాకిస్తాన్ అణు పరీక్షలు కొనసాగిస్తుందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను సీరియస్ గా తీసుకుంటామన్నారు. కాగా, 2026 భారత్‌లో పర్యటిస్తానని డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన గురించి అడిగిన ప్రశ్నకు స్పందించిన జైశ్వాల్, దీనిపై ప్రస్తుతానికి తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు.






ఆస్ట్రేలియాతో చివరి మ్యాచ్ కు
టీమిండియా రెడీ

- నేడు బ్రిస్బేన్ లో జరుగనున్న కీలక మ్యాచ్

ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా శనివారం చివరి మ్యాచ్ ఆడనుంది. బ్రిస్బేన్ లో జరిగే ఈ మ్యాచ్ కోసం భారత జట్టు సిద్ధమవుతోంది. నాలుగో టీ20లో అద్భుత విజయాన్ని అందుకున్న టీమిండియా ఈ మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగించి సిరీస్ సాధించాలనుకుంటోంది. మరోవైపు యాషెస్ సిరీస్ నేపథ్యంలో సీనియర్లు దూరమైన వేళ యువ ప్లేయర్లతో ఆడుతున్న ఆసీస్ సిరీస్ ను సమం చేయాలనుకుంటోంది. కాగా, టీ20 ప్రపంచకప్ సన్నాహకంలో భాగంగా ఆఖరి మ్యాచ్‌లోనూ భారత్ మార్పులు చేసే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డితో పాటు సంజూ శాంసన్‌ను తుది జట్టులోకి రావచ్చు. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు శివమ్ దూబేకు విశ్రాంతి ఇచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఈ సిరీస్‌ను టీమిండియా ప్రయోగాలకు ఉపయోగించుకుంది. హర్షిత్ రాణా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌ను తొలి రెండు టీ20లలో ఆడించగా, వారు అంతగా రాణించలేదు. దాంతో మూడో టీ20 నుంచి ఈ ముగ్గురిని తప్పించి జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌కు చాన్స్ ఇచ్చారు. ఈ ముగ్గురు అద్భుతంగా ఆడారు. నాలుగో టీ20లో జితేశ్, సుందర్ విఫలమైనా ఆఖరి మ్యాచ్‌లో కొనసాగుతారు. ఇవి మినహా తుది జట్టులో భారీగా మార్పులు జరిగే అవకాశం లేదు. బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ రాణించాల్సి ఉంటుంది. సూర్య వైఫల్యం విమర్శలకు దారి తీస్తోంది. బౌలింగ్ బాధ్యతలను జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ పంచుకుందారు. నితీశ్ కుమార్ రెడ్డి అండగా ఉంటాడు.





భారత హాకీ వందేండ్ల వేడుకలు

- 550 జిల్లాలలో ఉత్సవాల కొనసాగింపు


భారతహాకీ ప్రయాణానికి నవంబర్ ఏడుతో వందేండ్లు నిండాయి. ఈ చరిత్రాత్మక రోజును పురస్కరించుకుని దేశం మొత్తం సంబరాలు జరిగాయి. ఇండియన్ హాకీ ఫెడరేషన్ ఏర్పడి వందేండ్లు పూర్తయిన సందర్భంగా హాకీ ఇండియా దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తోంది. ఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో ఉదయం 8:30 గంటల నుంచే ప్రధాన కార్యక్రమం మొదలైంది. దేశంలోని 550 జిల్లాలలో ఈ వేడుకలు జరిగాయి. ఒక్కరోజే 1400 హాకీ మ్యాచ్‌లు నిర్వహించారు. అందులో 36 వేల మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగే ప్రధాన వేడుకలో 'కేంద్ర మంత్రి ఎలెవన్' వర్సెస్ 'హాకీ ఇండియా మిక్స్‌డ్ ఎలెవన్' జాతీయ జట్లకు చెందిన స్టార్ మెన్ అండ్ వుమెన్ ప్లేయర్లు కలిసి ఆడటం ఈ వేడుకకు వన్నె తెచ్చింది, దీని తర్వాత, దేశానికి గర్వకారణంగా నిలిచిన హాకీ లెజెండ్‌స్‌ను సన్మానించారు. '100 ఇయర్స్ ఆఫ్ ఇండియన్ హాకీ" అనే ప్రత్యేక పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. 1925లో ఇండియన్ హాకీ ఫెడరేషన్ ఏర్పడిన మూడేండ్లకే, 1928 ఆమ్‌స్టర్‌డామ్ ఒలింపిక్స్‌లో మన టీమ్ తొలిసారి అడుగుపెట్టి, ఏకంగా గోల్డ్ మెడల్ సాధించింది. అక్కడి నుంచి 1980 వరకు మనది తిరుగులేని స్వర్ణయుగం. ఈ కాలంలో ఇండియా ఏకంగా 13 ఒలింపిక్ పతకాలు సాధించింది.



నేను నా తండ్రి కంటే చాలా భిన్నం

- శిక్షణ, మెంటారింగ్ పై యువరాజ్ సింగ్

టీమిండియా వెటరన్ క్రికెటర్ యువరాజ్ సింగ్ తన తండ్రి యోగరాజ్ సింగ్ గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఆయనలాంటి వ్యక్తిని ఖచ్చితంగా కానని స్పష్టం చేశారు. కోచింగ్, మెంటారింగ్ విషయంలో తన వైఖరి, తన తండ్రి వైఖరికి భిన్నంగా ఉంటుందని వివరించారు. నిజానికి యువరాజ్ సింగ్ కోచింగ్ ఇచ్చే విధానం లేదా యువ క్రీడాకారులకు దారి చూపే పద్ధతి తన తండ్రికి భిన్నంగా ఉంటుంది. యోగరాజ్ సింగ్ కఠిన క్రమశిక్షణ, దృఢమైన, కఠోరమైన వైఖరి ఉండాలంటారు. యువరాజ్ చిన్నతనంలో క్రికెట్ పై దృష్టి పెట్టేలా చేయడానికి, ఆయన స్కేటింగ్ షూస్‌ను విసిరేసిన సంఘటనలు వంటివి ఇందుకు నిదర్శనంగా ఇప్పటికీ చెప్పుకుంటారు. దీనికి పూర్తి విరుద్ధంగా యువరాజ్ సింగ్ శైలి సున్నితంగా ఉంటుంది. యువ క్రీడాకారుల అవసరాలను అర్థం చేసుకుంటారు. వారి భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఒక ఇంటర్వ్యూలో యువరాజ్ సింగ్ తన అభిప్రాయాలను ఇలా వెల్లడించారు. తాను ఖచ్చితంగా యోగరాజ్ సింగ్ లాంటివాడిని కాదని, చాలా విభిన్నమని, తన వ్యక్తిత్వం కూడా భిన్నంగా ఉంటుందన్నారు. అందుకే తన కోచింగ్ తీరు కూడా భిన్నంగా ఉంటున్నారు. కోచింగ్ ఇస్తున్నప్పుడు లేదా మెంటారింగ్ చేస్తున్నప్పుడు కేవలం ఏం చేయాలో చెప్పే బదులు వారి స్థానంలో ఉండి ఆలోచించాలని, వారి మానసిక స్థితిని అర్థం చేసుకోవాలని తాను భావిస్తానన్నారు. 19 యేండ్ల కుర్రాడి మనస్సులో ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యంమని యువరాజ్ సింగ్ చెప్పారు.








అదరగొట్టిన 'పెద్ది'

'చికిరి చికిరి' పాట రిలీజ్


మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ఫస్ట్ సింగిల్ అయిన 'చికిరి చికిరి' ప్రోమోకు అద్భుతమైన స్పందన వచ్చింది, లిరికల్ వీడియోపై భారీ అంచనాలని పెంచింది. భావోద్వేగాలను అద్భుతంగా చూపించే దర్శకుడు బుచ్చి బాబు సాన, ఈసారి ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రహ్మాన్‌తో పని చేయడం తన కల నెరవేరినట్టుగా చెప్పారు. రహ్మాన్‌పై ఆయనకున్న అభిమానాన్ని ఈ ప్రమోలోనే చూపించారు. పాట సిట్యుయేషన్ రహ్మాన్ పై ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. ఆయన ఈ పాటని సిట్యుయేషన్ తగ్గట్టుగా అద్భుతంగా మలిచారు. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. శుక్రవారం మేకర్స్ ఫస్ట్ సింగిల్ ని రిలీజ్ చేసి మరింత హైప్ పెంచారు. పర్వత ప్రాంతంలో నివసించే పెద్ది.. ఓ రోజు గ్రామంలో తన చికిరిని చూసిన క్షణం నుంచే ఆమె అందం, అమాయకత్వం అతనిని మంత్ర ముగ్ధుడ్ని చేస్తాయి. ఆమెను చూసి కలిగిన ఆ ఆనం దాన్ని ప్రతి క్షణం వేడుక చేసుకుంటాడు. ఈ బ్యూటీఫుల్ ఫీలింగ్స్ ని లిరిసిస్ట్ బాలాజీ తన సాహిత్యంలో ఎంతో అద్భుతంగా మలిచారు. ఏఆర్ రహ్మాన్ సంగీతం అద్భుతంగా వుంది. ఫోక్ ఎనర్జీ, మోడర్న్ బీట్‌లతో కంపోజ్ చేసిన చికిరి అదిరిపోయింది. గాయకుడు మొహిత్ చౌహాన్ తన ఎనర్జిటిక్ వోకల్స్ తో పాటకు జీవం పోశారు. జాని మాస్టర్ కొరియోగ్రఫీతో పాట విజువల్స్ మరింత బ్యూటీఫుల్‌గా మారాయి. రామ్ చరణ్ రాకింగ్ డ్యాన్స్ మూవ్స్ తో అదరగొట్టారు. ఆయన ఎక్స్‌ప్రెషన్స్, రిథమ్, హ్యాపీనెస్ ప్రతి ఫ్రేమ్‌లో అద్భుతంగా వున్నాయి. ఆయన హుక్ స్టెప్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సాంగ్ ప్రేమను సెలబ్రేట్ చేస్తున్న అనుభూతి ఇస్తోంది. జాన్వీ కపూర్ ఇంట్రో షాట్ ఈ సాంగ్‌లో హైలైట్‌గా నిలిచింది. ఆమె దీపాన్ని ఎత్తి తన లుక్‌ని రివీల్ చేసే సీన్ మ్యాజిక్ లా ఉంది. ఆమె గ్రేస్, చార్మ్ అద్భుతంగా వుంది. పాట ట్యూన్, లిరిక్స్, విజువల్స్, ఎనర్జీ అన్నీ కలిపి "చికిరి చికిరి"ను నెక్స్ట్ పాన్‌ఇండియా వైరల్ సాంగ్‌గా నిలబెట్టాయి. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, డాన్స్ ఛాలెంజ్‌లకు ఇది పర్ఫెక్ట్ సాంగ్. చికిరి 'పెద్ది' మ్యూజికల్ జర్నీకి బ్లాక్‌బస్టర్ స్టార్ట్ ఇచ్చింది.



భారత స్టార్ పారా ఆర్చర్ శీతల్ దేవి మరో ఘనత

- శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపిక

ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ పారా ఆర్చర్ శీతల్ దేవి మరో ఘనతను సాధించింది. ఇటీవల జాతీయ ట్రయల్స్‌లో అద్భుత ప్రదర్శన తర్వాత, సౌదీ జెడ్డాలో జరగనున్న ఆసియా కప్ స్టేజ్ త్రీ పోటీలకు శీతల్ ఎంపికైంది. ఈ పోటీలో ఆమె, శారీరకంగా ఫిట్ ఉన్న అథ్లెట్లను ఎదుర్కొంటుంది. సౌదీ అరేబియా జెడ్డాలో వచ్చే నెలలో స్టేజ్ త్రీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు శీతల్ దేవిని శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపిక చేశారు. ఇది చరిత్రాత్మకం నిర్ణయం అంటున్నారు. శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపికైన మొదటి భారతీయ పారా ఆర్చర్‌గా కూడా ఆమె రికార్డు సాధించింది. 'నేను విలు విద్య ప్రారంభించినప్పుడు ఒక కల వచ్చింది. ఏదో ఒక రోజు నేను ఉత్తమ ఆర్చర్లతో పోటీ పడాలనుకున్నాను. శాయశక్తులా ప్రయత్నించాను. కలను ఎప్పుడూ వదులుకోలేదు. ప్రతి ఓటమి నుంచి నేను పాఠాలు నేర్చుకున్నాను. ఫలితంగా ఈ రోజు నా కల నిజమైంది' అని శీతల్ ఆనందం వ్యక్తం చేసింది. హర్యానాలో సోనిపట్ లో జరిగిన జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో 18 యేండ్ల శీతల్ పోటీ పడింది. దాదాపు 60 మంది ఉత్తమ ఆర్చర్లతో పోటీపడి మూడో స్థానం దక్కించుకుంది.



మలయాళంలో 'అనుష్క' ఎంట్రీ

'కథనార్' ఫస్ట్ లుక్ రిలీజ్

టాలీవుడ్ భామ అనుష్క శెట్టి మలయాళం ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్న సంగతి తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కథనార్. ఈ సినిమాకు రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాత గోకులం గోపాలన్ నిర్మిస్తున్నాడు. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం రాబోతుండగా.. ఈ చిత్రంలో జయసూర్య, ప్రభుదేవ, ప్రేమదేశం వినీత్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే నేడు అనుష్క శెట్టి పుట్టినరోజు సందర్భంగా ఆమెకి శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం అనుష్క ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఈ చిత్రంలో అనుష్కా నీలా అనే పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించింది.

'భ్రమయుగం' అరుదైన ఘనత

లాస్ ఏంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియంలో 'భ్రమయుగం' చిత్ర ప్రదర్శన



ఇటీవల ప్రకటించిన 55వ కేరళ రాష్ట్ర చలన చిత్ర అవార్డులలో నాలుగు విభాగాల్లో సత్తా చాటిన 'భ్రమయుగం' చిత్రం, మరో అరుదైన ఘనతను సాధించింది. లాస్ ఏంజెల్స్‌లోని 'అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్'లో 'భ్రమయుగం' ప్రత్యేక ప్రదర్శనకు సిద్ధమైంది. నైట్ షిఫ్ట్ స్టూడియోస్ మరియు వైనాట్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ రచన, దర్శకత్వం వహించారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 12, 2026న అకాడమీ మ్యూజియం యొక్క 'వేర్ ది ఫారెస్ట్ మీట్స్ ది సీ: ఫోక్లోర్ ఫ్రమ్ ఎరౌండ్ ది వరల్డ్' (Where the Forest Meets the Sea: Folklore from Around the World) చిత్రోత్సవ శ్రేణిలో భాగంగా జరుగనుంది. ఈ కార్యక్రమం జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు కొనసాగుతుంది. రాహుల్ సదాశివన్ రచన మరియు దర్శకత్వం వహించిన 'భ్రమయుగం''చిత్రం, కేరళ జానపద కథల చీకటి యుగాల నేపథ్యంలో భయం, శక్తి మరియు మానవ బలహీనతలను ఆవిష్కరించిన గాఢమైన అన్వేషణ. ఈ చిత్రం బ్లాక్ & వైట్ ఫార్మాట్‌లో తెరకెక్కించబడింది. కట్టిపడేసే కథాకథనాలు, అద్భుతమైన సాంకేతికతతో ఈ చిత్రం విశేష ప్రశంసలు అందుకుంది. 'భ్రమయుగం' చిత్రంలో కొడుమోన్ పోట్టి అనే పాత్రలో లెజెండరీ నటుడు మమ్ముట్టి అద్భుతమైన నటన కనబరిచారు. అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్ ముఖ్య పాత్రల్లో నటించారు.

ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: షెహనాద్ జలాల్ (ISC), సంగీతం: క్రిస్టో జేవియర్, కళా దర్శకత్వం: జోతిష్ శంకర్, కూర్పు: షఫీక్ మొహమ్మద్ అలీ, సౌండ్ డిజైన్: జయదేవన్ చక్కదత్, సౌండ్ మిక్స్: ఎం.ఆర్. రాజకృష్ణన్, సంభాషణలు: టి.డి. రామకృష్ణన్, మేకప్: రోనెక్స్ జావియర్ & జార్జ్ ఎస్., ప్రోస్తేటిక్స్: ప్రీతిషీల్ సింగ్ డిసౌజా, దుస్తులు: మెల్వీ జె.

'అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్' గురించి

అకాడమీ మ్యూజియం అనేది కళలు, శాస్త్రాలు మరియు చలనచిత్ర కళాకారులకు అంకితం చేయబడిన ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియం. ఈ మ్యూజియం ప్రదర్శనలు, కార్యక్రమాలు, సేకరణల ద్వారా సినిమా యొక్క అవగాహన, వేడుక మరియు సంరక్షణను ప్రోత్సహించడంలో ముందంజలో ఉంది. ప్రిట్జ్‌కర్ బహుమతి గ్రహీత ఆర్కిటెక్ట్ రెంజో పియానో రూపొందించిన ఈ మ్యూజియం, పునరుద్ధరించబడిన చారిత్రాత్మక సాబన్ బిల్డింగ్ (మునుపటి మే కంపెనీ బిల్డింగ్, 1939) మరియు గోళాకార నిర్మాణాన్ని కలుపుకుని ఉంటుంది. ఈ భవనాల్లో మొత్తం 50,000 చదరపు అడుగుల ప్రదర్శన స్థలాలు, రెండు అత్యాధునిక థియేటర్లు, షిర్లీ టెంపుల్ ఎడ్యుకేషన్ స్టూడియో మరియు ఉచిత అందమైన ప్రజా స్థలాలు ఉన్నాయి. అలాగే, 'వాల్ట్ డిస్నీ కంపెనీ పియాజ్జా' మరియు స్పీల్‌బర్గ్ ఫ్యామిలీ గ్యాలరీ, అకాడమీ మ్యూజియం స్టోర్ మరియు ఫ్యానీస్ రెస్టారెంట్ & కేఫ్‌లను కలిగి ఉన్న 'సిడ్నీ పోయిటియర్ గ్రాండ్ లాబీ' ఉన్నాయి. అకాడమీ మ్యూజియం వారానికి ఆరు రోజులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

'భ్రమయుగం' గురించి, నైట్ షిఫ్ట్ స్టూడియోస్ గురించి

మమ్ముట్టి ప్రధాన పాత్రలో రాహుల్ సదాశివన్ రచన మరియు దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం 'భ్రమయుగం'. హారర్‌థ్రిల్లర్ జానర్ చిత్రాలను రూపొందించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా స్థాపించబడిన ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ నైట్ షిఫ్ట్ స్టూడియోస్ పతాకంపై తొలి చిత్రంగా 'భ్రమయుగం' తెరకెక్కించింది. వైనాట్ స్టూడియోస్‌తో కలిసి నైట్ షిఫ్ట్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మించింది. నైట్ షిఫ్ట్ స్టూడియోస్ బ్యానర్ లో రూపుదిద్దుకున్న తాజా చిత్రం 'డైస్ ఇరే' (Dies Irae) 2025 అక్టోబర్ 31న విడుదలైంది. ఇందులో ప్రణవ్ మోహన్‌లాల్ ప్రధాన పాత్ర పోషించారు. ఇది నైట్ షిఫ్ట్ స్టూడియోస్ లో తెరకెక్కిన రెండవ చిత్రం. 'భ్రమయుగం' దర్శకుడు మరియు ప్రధాన సాంకేతిక బృందం ఈ చిత్రానికి కూడా పని చేయడం విశేషం.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200